RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 136 మంగళవారం, జులై 2, 2024 పేజీలు : 4

## నీట్ యుజి సవరించిన ర్యాంకుల జాబితా విడుదల

న్యూఢిల్లీ: వైద్య ప్రవేశ పరీక్ష నీట్ యుజికి చెందిన సవరించిన ర్యాంకుల జాబితాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) సోమవారం ప్రకటించింది. మే 5వ తేదీన జరిగిన నీట్ యుజి పరీక్షకు సంబంధించి ఆరు పరీక్షా కేంద్రాలలో పరీక్ష ఆల్యంగా ప్రారంభం కావడంతో సమయాన్ని కోల్పోయిన అభ్యర్థులకు పరిహారంగా కొన్ని గ్రేస్ మార్కులను కలిపిన ఎన్‌టిఏ తరువాత వాటిని రద్దు చేసింది. ఆ అభ్యర్థులకు తిరిగి పరీక్ష నిర్వహించిన అనంతరం సవరించిన ర్యాంకుల జాబితాను ఎన్‌టిఏ ప్రటించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూన్ 23న ఏడు కేంద్రాలలో మరోసారి పరీక్షను ఎన్‌టిఏ నిర్వహించింది.

## మళ్లీ కవితకు నిరాశ...

# బెయిల్‌కు నో



ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మళ్లీ నిరాశే ఎదురైంది.. ఆమె బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు నేడు కొట్టివేసింది. సీబీఐ అవినీతి కేసుతో పాటు ఈడీ మనీలాండరింగ్ కేసులో కవిత బెయిల్ దరఖాస్తులను కొట్టివేస్తూ మే 6న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆమె సవాల్ చేశారు. ఈ కేసులోని 50 మంది నిందితుల్లో కవిత ఒక్కరే మహిళ అని, దీనిని పరిగణనలోకి తీసుకొని బెయిల్ ఇవ్వాలని కవిత తరఫు న్యాయవాది కోర్టును కోరారు. అయితే ఈ వాదనను సీబీఐ, ఈడీ వ్యతిరేకించాయి. దీనిపై నేడు జస్టిస్ స్వర్ణకాంతశర్మ తీర్పు వెలువరిస్తూ ఆమె బెయిల్ పిటిషన్ తోసిపుచ్చారు. కాగా, ఈ కేసులో కవిత మూడు నెలలుగా జైల్లో ఉంటున్నారు. ఆమె తీహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

# గవర్నరును కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్: కేబినెట్ ను విస్తరించొచ్చు నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ను సోమవారం కలుసుకున్నారు. రాజ్ భవన్ లో ఆయనని కలుసుకున్నారు. రానున్న కొన్ని రోజుల్లో కేబినెట్ విస్తరణ ఉండనున్నదన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ముఖ్యమంత్రి గత వారం ఢిల్లీకి వెళ్లి అక్కడ కాంగ్రెస్ ప్రధాన నాయకులతో కేబినెట్ విస్తరణ గురించి చర్చించారని తెలిసింది. ఐదు నుంచి ఆరుగురు మంత్రులను కేబినెట్ లోకి తీసుకోవడం ఖరారయిందని తెలుస్తోంది. మంత్రి పదవులు వస్తాయని చాలా మంది గత ఆరు మాసాలుగా ఎదురుచూస్తున్నారు. రేవంత్ రెడ్డి, ఆయన 11 మంది కేబినెట్ కొలీగులు 2023 డిసెంబర్ 7న ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యమంత్రి సహా రాష్ట్రానికి గరిష్ఠంగా 18 మంది మంత్రులు ఉండొచ్చు. ఇదిలావుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నఅసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న బిల్లుల గురించి గవర్నర్ కు వివరించారని తెలుస్తోంది. చర్చల సందర్భంగా నామినేటెడ్ ఎంఎల్ సిల అంశం కూడా చర్చకు వచ్చిందని తెలుస్తోంది. గత మార్చిలో తెలంగాణ హైకోర్టు గవర్నర్ కోటా కింద నామినేట్ అయిన ఎం.కోదండరామ్, అమీర్ అలీ ఖాన్ నామినేషన్లను కొట్టేసింది. గవర్నర్ ఉత్తర్వును 2023 సెప్టెంబర్ 19న హైకోర్టు కొట్టేసింది. బిఆర్ఎస్ నాయకులు శ్రవన్ దాసోజు, కె. సత్యనారాయణ నామినేషన్లను తిరస్కరించింది. ఆ తర్వాత గవర్నర్ తమిళిసై



సౌందరరాజన్, గవర్నర్ కోటా కింద వారి నామినేషన్లను తిరస్కరించారు. గవర్నర్ ఉత్తర్వులను సవాలు చేస్తూ బిఆర్ఎస్ నాయకులు హైకోర్టులో రిట్ పిటీషన్లను దాఖలు చేశారు. గవర్నర్ ఎంఎల్ సిలను నియమించేలా వారు అప్పీలు చేసుకున్నారు.

## ఇకపై బాధితులకు...

# సంపూర్ణ న్యాయం

### : కొత్త న్యాయచట్టాలపై అమిత్‌షా



న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి రావడంపై కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. ఇకపై బాధితులకు సత్వర, వేగవంతమైన న్యాయం జరుగుతుందన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్ల తరువాత స్వదేశీ న్యాయవ్యవస్థ అమలులోకి వచ్చింది. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు. వలస రాజ్యాల చట్టాల స్థానంలో భారత పార్లమెంట్ రూపొందించిన ఈ చట్టాలు ఎన్నో రకాలుగా ఆలోచించి తెచ్చినవి. ఈ చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది. ఇప్పటివరకు ఉన్న పోలీస్‌ల హక్కులతోపాటు బాధితుల, ఫిర్యాదుదారుల హక్కులు కూడా రక్షించబడతాయి ” అని షా వెల్లడించారు.

## 4న హస్తిన పర్యటనకు ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల నాలుగో తేదిన ఢిల్లీకి వెళ్లనున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన హస్తిన పర్యటనకు వెళ్తున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేంద్రం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు, కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రానికి గతంలో రావాల్సిన నిధులు, కొత్తగా తెచ్చుకోవాల్సిన పథకాలపై నిర్మలా సీతారామన్‌తో చర్చించే అవకాశం ఉంది. గత ప్రభుత్వం తీసుకున్న అప్పుల నుంచి తేరుకొనేందుకు కేంద్రం నుంచి అవసరమైన మద్దతును కోరడంతో పాటు రాష్ట్రానికి విరివిగా నిధులు అందించి అమరావతి, పోలవరం నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహకరించాలని కోరనున్నట్లు సమాచారం. ఇక ఈ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీని సైతం కలిసే అవకాశం కూడా ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ప్రస్తుతం కేంద్ర బడ్జెట్‌పై కసరత్తు కొనసాగుతోంది. శాఖల వారీగా సమీక్షలు, వివిధ రంగాల నిపుణుల ద్వారా బడ్జెట్ కేటాయింపు అంశాలపై చర్చలు జరుగుతోన్న నేపథ్యంలో చంద్రబాబు పర్యటన కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.


## క్యాన్సర్ బాధిత బాలుడికి తక్షణమే వైద్యం అందించాలి: సిఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: వరంగల్ లో తనను కలవలేక పోయిన క్యాన్సర్ బాధిత బాలుడు మహమ్మద్ అదిల్ అహ్మద్ ఉదంతంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పందించారు. తక్షణమే వైద్య సహాయం అందించాలని సిఎంఓ అధికారులను ఆయన ఆదేశించారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనలతో సిఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు బాలుడి కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. నెల రోజుల క్రితం అదిల్ అహ్మద్ చికిత్స కోసం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి లక్ష రూపాయల ఎల్వోసి మంజూరు చేసింది. ప్రస్తుతం అదిల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితిపై వేముల శ్రీనివాసులు ఆరా తీశారు. సిఎంఆర్ఎఫ్ ద్వారా కావాల్సిన మరింత సాయం అందిస్తామని ఆయన అదిల్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

## పింఛనులను పంపిణీ చేసిన చంద్రబాబు నాయుడు

**అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంక్షేమ పింఛనులను నేడు గుంటూరు జిల్లా పెనుమాకలో పంపిణీ చేశారు. 'ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు' పేరిట వీటిని ఇచ్చారు. ఇదివరకు రూ. 3000 గా ఉన్న పింఛనును రూ. 4000 పెంచి మరీ పంచారు. పింఛనుల పంపిణీలో భాగంగా ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారితో మాటామంతీ జరిపి మరీ పంచారు బాబు.**



## తెలంగాణ ప్రజలకు...

# విద్యుత్ శాఖ విజ్ఞప్తి

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు విద్యుత్ శాఖ కీలక ప్రకటన చేసింది. విద్యుత్ వినియోగదారులు ఇకపై ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్స్ ద్వారా కరెంట్ బిల్లు కట్ట వద్దని విజ్ఞప్తి చేసింది. భారత రిజర్వు బ్యాంకు ఆదేశాల ప్రకారం సర్వీస్ ప్రొవైడర్లయిన ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే, గూగుల్ పే, బ్యాంకుల ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపులు నిలిపివేసినట్లు ప్రకటించింది. ఈక్రమంలో నేటి నుంచి TGSPDCL వెబ్సైట్/ మొబైల్ యాప్ ద్వారానే నెలవారీ కరెంట్ బిల్లులు చెల్లించాలని వినియోగదారులను కోరింది. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల మేరకు ఉచిత విద్యుత్ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద.. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తున్నవారికి కరెంట్ బిల్ జారీ చేసినా సరే.. వారు బిల్ కట్టాల్సిన పనిలేదు. ఎవరైతే 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగిస్తున్నారో వాళ్లు మాత్రమే కరెంట్ బిల్లు చెల్లించాలంది.

## రాహుల్ గాంధీ కీలక పాయింట్స్:

- రామజన్మభూమి బిజెపిది కాదని ప్రజలు మెసేజ్ ఇచ్చారు
- అయోధ్య ప్రజలను మందిరం దగ్గరకు కూడా రానివ్వలేదు
- అయోధ్య ఎయిర్ పోర్టు కోసం ప్రజల భూములు లాక్కుకున్నారు.
- అయెధ్య మందిరం ప్రారంభానికి కార్పొరేట్ పెద్దలకు మాత్రమే ఆహ్వానం అందించారు
- అదానీ ఆదేశాల మేరకు మోడీ పనిచేస్తారు
- వ్యాపారవేత్తలకు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశారు.. రైతులకు కూడా మాఫీ చేయొచ్చు కదా?
- రైతులను భయపెట్టి నల్ల చట్టాలు తెచ్చారు.
- 700మంది రైతులు చనిపోయారు
- బిజెపి హిందువులకు వ్యతిరేకం
- బిజెపి జమ్మూకాశ్మీర్ ను మూడు ముక్కలు చేసింది
- బీజేపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి
- బిజెపి ఆధేశాలతో సీబిఐ, ఇడీ.. ప్రతిక్షాలను వేధిస్తున్నాయి
- తప్పుడు కేసులతో విపక్ష నేతలను జైల్లో పెడుతున్నారు
- నా ఎంపి పదవి, ఇంటిని లాక్కుకున్నారు
- ఇడి నుంచి 55 గంటల విచారణ ఎదుర్కొన్నారు
- కేంద్రం ఆదేశాలతోనే నన్ను టార్గెట్ చేశారు
- అధికారం కంటే నిజం గొప్పది
- విపక్షంలో ఉన్నందుకు గర్వంగా ఉంది

## హిందూ సమాజం అంటే...

# బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాత్రమే కాదు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా లోక్‌సభలో సోమవారం అధికార, విపక్షాల మధ్య వాదోపవాదనలు జరిగాయి. విపక్ష నేతగా రాహుల్ గాంధీ తొలిసారిగా లోక్‌సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. హిందూ సమాజం అంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాత్రమే కాదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు తాము పోరాడుతుంటే తప్పుడు కేసులు పెట్టి విపక్ష నేతలను ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపించారు. తన ఎంపీ పదవితో పాటు ఇంటిని లాక్కున్నారని వాపోయారు. ప్రతిపక్షంలో ఉన్నందుకు తాము గర్వపడుతున్నామన్నారు.

### అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తాం

ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఈ పథకం సైన్యం రూపొందించింది కాదని, నోట్ల రద్దు మాదిరిగానే ప్రధాని కార్యాలయంలో పుట్టిందన్నారు. స్వల్ప కాలిక శిక్షణతో యుద్ధరంగంలోకి అగ్నివీరులను పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైనా సైనికులు 5 ఏళ్ల పాటు శిక్షణ పొందుతారని, వారి ముందు అగ్నివీరులు భయంతో విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అగ్నివీరులకు అమరవీరుల హెూదా దక్కడం లేదని, వారికి పెన్షన్ సదుపాయం లేదని తెలిపారు.



### ప్రొఫెషనల్ పరీక్షలను కమర్షియల్‌గా మార్చారు

నోట్ల రద్దు, తప్పుడు జీఎస్టీ విధానాలతో ఉపాధి కల్పన కలగా మారిందన్నారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ లో చిచ్చు పెట్టారని.. మణిపూర్ లో మంటలు రాజేశారని మండిపడ్డారు. దేవుడితో డైరెక్ట్ కనెక్షన్ ఉందని స్వయంగా చెప్పిన ప్రధాని మోదీ.. హఠాత్తుగా ఒక రోజు నోట్లు రద్దు చేశారని గుర్తు చేశారు. ప్రొఫెషనల్ పరీక్షలను కమర్షియల్ గా మార్చారు.

## సంపాదకీయం

# అందరికీ వైద్యం!

డెబ్బై ఐదు సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా అందరికీ వైద్యం కలగానే మిగిలింది. 144 కోట్లకు పైనే జనాభా కలిగిన మన దేశంలో ప్రజారోగ్యానికి ఖర్చు పెడుతున్నది జిడిపిలో 1.35 శాతం మాత్రమే అంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. పేద దేశమైనటువంటి క్యూబా తన జాతీయ ఆదాయంలో 12 శాతం ప్రజారోగ్యం కోసం ఖర్చు పెడుతుంది. బ్రిటన్, అమెరికా, స్వీడన్, జపాన్, జర్మనీ తదితర దేశాలు తమ జిడిపిలో దాదాపు పది శాతం ఖర్చు పెడుతున్నాయి. ప్రభుత్వం బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయించదు. డాక్టర్ల ఖాళీ స్థానాలను భర్తీ చేయదు. మిషన్లను బాగు చేయదు. ప్రభుత్వ ప్రోత్సాహం ప్రైవేట్ ఆసుపత్రుల వైపే వుండటం వలన ధర్మాసుపత్రులు ధర్మానికి నడుస్తున్నాయి. దిక్కులేనివారు, అప్పు పుట్టనివారు, ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చులను భరాయించలేని వారికే ప్రభుత్వ వైద్యం దిక్కయింది. మొత్తం 706 మెడికల్ కాలేజీలున్నాయి. అందులో 386 ప్రభుత్వ కళాశాలలు, 320 ప్రైవేటు మెడికల్ కాలేజీ లున్నాయి. లక్షకు పైగా ఎంబిబిఎస్ సీట్లున్నాయి. అందులో సగం సీట్లు ప్రభుత్వ కాలేజీలోనూ మరో సగం సీట్లు ప్రైవేటు కాలేజీల్లో వున్నాయి. ప్రతి సంవత్సరం దాదాపు లక్ష మంది డాక్టర్లవుతున్నారు. లక్ష ఎంబిబిఎస్ సీట్లకు 24 లక్షల మంది నీట్ పరీక్ష రాశారు. ప్రభుత్వ కాలేజీలలోనూ ఫీజులు లక్షల్లో వసూలు చేయడానికి పూనుకుంటున్నారు. సీటు కొని ఎంబిబిఎస్ పూర్తయ్యేసరికి కోటి రూపాయలు ఖర్చవుతుంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ స్పెషలిస్ట్ అవ్వాలన్నా, ఎక్స్ రే, అల్ట్రా సౌండ్ లాంటి మిషన్లు కొని ఆసుపత్రి ప్రారంభించాలన్నా మరి కొన్ని కోట్లు పెట్టుబడి పెట్టాలి. పెట్టుబడి లాభాలను కోరుకుంటుంది. లాభాలు రావాలంటే రోగుల దగ్గర నుండి రాబట్టాలి. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన డాక్టరు, ప్రాక్టీసు పెట్టిన మొదటిరోజు నుండి, అసలు, వడ్డీ ఎట్లా రాబట్టాలా అనే ఆలోచనలోనే వుంటాడు. డాక్టరుకు–రోగికి మధ్య డబ్బు ప్రమేయం లేనపుడే అందరికీ మెరుగైన వైద్యం లభిస్తుంది. వైద్య వృత్తిలోకి కార్పొరేట్ హాస్పిటళ్లు, వైద్య రంగంలోకి విదేశీ పెట్టుబడులు ప్రవేశించటం వైద్యం వ్యాపారం కావాడానికి మరో కారణం. దాంతో ప్రభుత్వాసుపత్రుల స్థానాన్ని, కుటుంబ వైద్యుల స్థానాన్ని కార్పొరేట్ హాస్పిటళ్లు ఆక్రమించేశాయి. అపోలో హాస్పిటల్స్ భారతదేశంలోనే పూర్తి స్థాయి కార్పోరేట్ హాస్పిటల్గా అభివృద్ధి చెందింది. 10,000 పడకలతో 73 ఆసుపత్రులు వున్నాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం అపోలోలో ఎక్కువగా వుంది. మణిపాల్ హాస్పిటల్స్ భారతదేశంలో రెండవ అతి పెద్ద హాస్పిటల్ చైన్. దాని వెబ్సైట్ ప్రకారం, డజనుకు పైగా నగరాల్లో 33 కంటే ఎక్కువ మల్టీ–స్పెషాలిటీ హాస్పిటళ్లను నిర్వహిస్తోంది. సింగపూర్ మల్టీ నేషనల్ కంపెనీ టెమా సెక్ మణిపాల్ హాస్పిటల్స్లో తన వాటాను 2023లో 59 శాతానికి పెంచింది. పారు, ఇతర పెట్టుబడిదారుల నుండి వాటాలను కొనుగోలు చేసింది. దీని విలువ 4.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఆస్టర్ డీఎమ్ హెల్త్ కేర్ లిమిటెడ్ అనే మల్టీ నేషనల్ కంపెనీ సౌదీ, ఖతార్, జోర్డాన్, కువైట్, ఇండియాలలో వున్నది. ఇది రమేష్ హాస్పిటళ్లతో విలీనమైంది. మార్కెట్ కేపిటలైజేషన్ రూ. 17,588 కోట్లు. అమెరికా, యూరప్ దేశాల్లోని ఆధునిక వైద్య పద్ధతులు, ఆధునిక పరికరాలన్నీ మన దేశంలోనూ అందుబాటులో వున్నాయి. వ్యాధి నిర్ధారణకు సైన్స్ ఇతోధికంగా ఉపయోగపడింది. ఇదివరకు అసాధ్యం అనుకున్నటువంటి అనేక జబ్బులకు మందులు కనుక్కోగలిగారు. రకరకాలయిన ఆపరేషన్లు కొత్త పరికరాలతో సులువుగా చేయగల్గుతున్నారు. నూతన చికిత్సా పద్ధతులను కనుగొన్నారు. ఫిజిక్స్ అభివృద్ధి కావడం వలన లాపరోస్కోపిక్ సర్జరీ, రోబో సర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్ అభివృద్ధి అయ్యాయి. సైన్స్ విజయం వైద్యంలో రోగ నిర్ధారణకు, చికిత్సకు ఎనలేని అవకాశాలను కల్పించింది. ఇటువంటి అత్యాధునిక వైద్యం కార్పొరేట్ ఆసుపత్రులలోనే లభ్యమవుతుంది. విశాల ప్రజానీకానికి ఉపయోగపడవలసిన సైన్స్ కార్పొరేట్ వ్యాపార సంస్థల చేతుల్లోకి వెళ్ళింది. వైద్యం సరుకైంది. వైద్యం వ్యాపారమై, ఖరీదైపోయింది. కొద్దిమంది ధనవంతులు ఎంత ఖర్చయినా భరించి రోగాల నుంచి బయట పడుతున్నారు. మరణాన్ని వాయిదా వేస్తున్నారు. రోగం వచ్చి హాస్పిటల్లో చేరితే ఆస్తులు అమ్ముకోవాల్సిందే అనేది సామాన్య ప్రజల అనుభవం. వైద్య ఖర్చులు భరించలేక ప్రతి సంవత్సరం కోట్లాది మంది పేదరికం లోకి జారిపోతున్నటువంటి అవస్థ అందరికీ తెలిసిందే. సంవత్సరానికి ఆరు కోట్ల మంది ప్రజలు వైద్య ఖర్చులు భరించలేక పేదరికంలోకి నెట్టబడుతున్నారని ఓ సర్వే చెప్తున్నది. మొత్తం ఆరోగ్య వ్యయంలో ఔషధ వ్యయం వాటా 29.6 శాతం వుంది. మేధో సంపత్తి హక్కులు, పేటెంట్ చట్టాలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందాల పేరున మందుల ఖరీదు రోజురోజుకూ పెరిగిపోతుంది. కార్పొరేట్ మందుల కంపెనీల లాభాలు ప్రతి సంవత్సరం పెరుగుతూ నేవున్నాయి. మందుల రేట్లు పెరుగుతూనే వున్నాయి. లాభాలు పెంచుకోవటం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నాసిరకం మందులు, నకిలీ మందులను అరికట్టని ప్రభుత్వాన్ని ఏమీ చేయలేని స్థితిలో ప్రజలున్నారు. పేటెంట్ పేరుతో మందుల ధరలు విపరీతంగా పెంచుకుంటూ పోతున్న కంపెనీలను అదుపు చేసే శక్తి ప్రభుత్వానికి లేదు.

# పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తప్పక మొక్కలు నాటాలి



**శామీర్ పేట, (గరుడ వార్త) :** పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ ఎల్లుబాయి పిలుపునిచ్చారు. సోమవారం శామీర్ పేట మండలం అలియాబాద్, లాల్ గడి మలక్ పేట గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణంలో ఏర్పడిన కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ఇక్కడ కాళీ జాగా ఉంటే అక్కడ మొక్కలు నాటాలని ఆమె కోరారు. ఈ మొక్కలతోనే భవిష్యత్ తరాలకు మనుగడ ఉంటుందని తెలిపారు. అత్యధికంగా మొక్కలు నాటి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ మమతబాయి, ఎంపిటీసీలు అశోక్, ఆల ఇందిరా రాజిరెడి , పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఆర్ఈజిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**శామీర్ పేట, (గరుడ వార్త):** అలనాటి మధురస్మృతులు తో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా పూర్వపు విద్యార్థులు సమ్మేళనం జరుపుకున్నారు. మూడు చింతలపల్లి మండలం ఉద్ధమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998 – 99 సంవత్సరం పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. కీసర మండలం చీర్యాల చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వపు విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు. తమ చిన్ననాటి స్నేహితులు చాలా సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో పాటు స్కూల్ సమయాల్లో చేసిన అల్లరి చేష్టలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వపు విద్యార్థులు పలు ఆట పాటలతో ఆనందంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఉపాధ్యాయులతో ఆనందంగా గడిపారు.

# ప్రజావాణి సమస్యల సత్వరం పరిష్కరించేలా చర్యలు - మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఇప్పటివరకు మన జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ప్రజావాణి మీటింగ్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతి తో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ తమ పరిధిలో ఇప్పటివరకు ప్రజావాణి లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, మీ పరిధిలో పరిష్కరించలేని దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆన్ లైన్ లోనే దరఖాస్తుదారునికి వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో (114) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ ను కలిసిన ఏవీ రంగనాథ్..



సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ ఏవీ రంగనాథ్ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు పాటుపడాలి: జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్

**రాజన్న సిరిసిల్ల:** చిన్న పిల్లలతో ఎవరైనా వెట్టిచాకిరి గురి చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు..బాల కార్మికుల కనిపిస్తే 1098, డయల్ 100కు సమాచారం అందించండి. జూలై 1 నుండి 31-07-2024 వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ లో పోలీస్ అధికారులు , చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బందితో జిల్లాలో రెండు టీమ్ లు ఏర్పాటు చేసి సమన్వయంతో విధులు నిర్వర్తించి జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాడం జరుగుతుందని ఎస్పీ సోమవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అన్ని శాఖల సమన్వయంతో పని చేసి ముస్కాన్. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 18సంవత్సరాల లోపు తప్పిపోయిన, వివిధ రకాల బాల కార్మికులు వారు కిరాణం షాప్ లలో, మెకానిక్ షాపులలో, హోటళ్లలో పనిచేస్తూ మరియు వదిలివేయబడిన పిల్లలు రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్న పిల్లలు ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా స్టేట్ హోమ్ కు పంపించడం జరుగుతుంది. చిన్న పిల్లలతో ఎవరైనా బలవంతంగా బిక్షాటన మరియు వెట్టి చాకిరీ చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు నమోదు చేయడం జరుగుతుందని,జిల్లాలో చిన్నపిల్లలతో పని చేపించే వారిపై నిత్యం నిఘా ఉంటుందని తెలిపారు.బాలల హక్కుల సంరక్షణ ద్వారానే సంపూర్ణ మానవ అభివృద్ధి సాధ్యమవుతుందని,ఆదిశగా అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ గారు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే 1098, డయల్ 100కు లేదా పోలీస్ లకు సమాచారం అందించాలని, ఈ ట్రోల్ ఫ్రీ నంబర్స్ 24/7 అందుబాటులో ఉంటాయని తెలిపారు.చిన్నపిల్లలు వెట్టిచాకిరికి గురికాకుండా వారి మొహంలో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సూచించారు.

===================================

## సిద్దిపేట సాగు నీటి కల సాకారం అయింది మీ హయాంలోనె మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్ధిపేట:** చరిత్ర లో నిలిచే పనులు ఎన్నో చేసిన ఘనత మీకె దక్కుతుంది. పదవులు శాశ్వతం కాదు. ప్రజా సేవా ఎల్లప్పుడూ ఉంటుందని చిన్నకూడూర్ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.హరీష్ రావు మాట్లాడుతూ చిన్నకోడూరు మండల పరిషత్ చివరి సర్వ సభ్యసమావేశం జరుపుకుంటున్నాం. మీరందరూ గత 5 సంవత్సరాలుగా కష్టపడి ప్రజలకు మీ సేవలను అందించారు. సర్పంచ్ లు ఎంపీటీసీ లు కలిసి చాల గ్రామాల్లో సమన్వయంతో పని చేశారు. కాళేశ్వరం నీళ్లను రైతులకు రెండు పంటలకు అందించిన గొప్ప అవకాశం మీ హయాంలో మీకు దొరికింది. ఎన్నో అభివృద్ధి పనులు చేస్తుంటాం. కానీ సాగునీరు మనకు జీవన ఆధారం. జీవన గతిని, పల్లెల ముఖ చిత్రాన్ని మార్చేది సాగు నీరు. అలాంటి సాగునీరు మీ ఈ అయిదేళ్ల కాలంలో రైతులకు అందడం మీ అదృష్టం.

గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా కొన్ని పాఠశాలలు బాగుచేసుకున్నాం. అదేవిధంగా సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్ లు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు ఇలా అనేక అభివృద్ధి పనులు మీ హయాం లో చేసుకున్నాం. అభివృద్ధి అక్కడితో ఆగదు. ఎంత చేసుకున్నా ఎంతో కొంత మిగిలే ఉంటుంది. ఇంకా పనులు మిగిలే ఉంటాయి. పదవుల్లో ఉన్నపుడు ఎన్ని మంచి పనులు చేశామనేదే శాశ్వతంగా నిలిచిపోతుంది. కాబట్టి మీకు మళ్లీ ఇంకా మంచి అవకాశాలు రావలని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలవాలని కోరుకుంటున్నాను. పదవులు ఎవరికీ శాశ్వతం కాదు, ఎవరైనా మాజీలు కావాల్సిందే. అధికారంలో ఉన్నా లేకపోయినా నా సహకారం ఎప్పుడికి మీకు ఉంటుంది. ఇలాగే ఎప్పుడు మీరు ప్రజల్లో ఉంటూ, ప్రజా సంబంధాలను కొనసాగిస్తూ ఉన్నత పదవులు పొందాలని ఆశిస్తున్నానని అన్నారు.

===================================

## ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వేగవంతంగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**జగిత్యాల:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు రాంబాబు, రఘువరన్ లతో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 44 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, రఘువరన్, జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డిఒలు, మధు సుధన్, ఆనంద్ కుమార్, ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లద్దాఖ్ ప్రమాదంలో మరణించిన జవాన్ల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఆర్థిక సహాయం చేయండి

### రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్ విజ్ఞప్తి.

లద్దాఖ్‌లో యుద్ధట్యాంకు కొట్టుకుపోయిన ప్రమాదంలో జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్.జగన్మోహన్‌రెడ్డిగారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు జవాన్లు మరణించిన ఘటనపై తీవ్ర విచారం వ్యక్తంచేశారు, వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. దేశ రక్షణలో వీరి సేవలు చిరస్మరణీయమన్నారు. వారి త్యాగాలు మరువలేనివన్నారు. కృష్ణాజిల్లా పెడన మండలం చేవెంద్రకు చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాల్వపల్లె గ్రామానికి చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా రేపల్లె మండలం ఇస్లాంపూర్ కు చెందిన సుభాన్ ఖాన్‌ల కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. మరణించిన జవాన్ల కుటుంబానికి రూ.1 కోటి చొప్పున ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన వైయస్సార్‌సీపీ నాయకులు వీరి అంత్యక్రియల్లో పాల్గొనాలని, వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని వైయస్.జగన్ ఆదేశించారు.

========================

## పలువురు ఐపీఎస్‌ల బదిలీలు

**హైదరాబాబాద్:** తెలంగాణ ప్రభుత్వం పలువురు ఐపీఎస్ లను బదిలీలు చేసింది. భద్రాచలం కొత్తగూడెం ఓఎస్డీగా పరితోష్ పంకజ్, సిరిశెట్టి సంక్రీత్ గవర్నర్ ఏడీసీగా, ములుగు ఓఎస్డీగా గీతే మహేశ్ బాబాసాహేబ్, సౌత్ ఈస్టోన్ డీసీపీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, భద్రాచలం ఏఎస్పీగా అంకిత్ కుమార్ శంఖవార్, భైంసా ఏఎస్పీగా అవినాశ్కుమార్, వేములవాడ ఏఎస్పీగా శేషాద్రినిరెడ్డి, ఏటూరు నాగారం ఏఎస్పీగా శివం ఉపాధ్యాయను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

========================

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం

### గ్రీవెన్స్ డే లో పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల:** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని ఎస్పీ అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని ఎస్పీ తెలిపారు.

============================

## నూతన పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలు, సామాజిక అంశాల పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల:** పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలు సామాజిక అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే విధంగా పోలీస్ కళాబృందం మరింత చురుకుగా పనిచేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కళాబృందం సభ్యులు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో టెక్నాలజీ పెరుగుదలతో పాటు సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతుందని ఈ సైబర్ నేరాలు నివారణ గురించి ప్రజలకు అవగాహన పరచాలని అదేవిధంగా పోలీస్ చట్టాలు, సిసి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత, మూఢనమ్మకాలు నివారణ, డయల్ 100 యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించే విధంగా చూడాలని కళ బృంద సభ్యులకు ఎస్పీ సూచించారు.

============================

## ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి: జిల్లా ఎస్పీ. కె.రఘువీర్ రెడ్డి


**నంద్యాల:** నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ( పి. జి. ఆర్. ఎస్) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఫిర్యాదిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" కార్యాక్రమంలో సివిల్ తగాదాలు,కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్థి పంపకాలలో మనస్పర్ధలు మొదలగునవి ఉన్నాయి.

============================

## వాలంటీర్లపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

**అమరావతి:** ఏపీ వాలంటీర్లతో మాత్రమే పెన్షన్ పంపిణీ చేయించాలనే మూర్ఖత్వంతో ఏప్రిల్, మే నెలల్లో 33మంది చనిపోయే పరిస్థితిని వైసీపీ తీసుకొచ్చిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. సచివాలయ సిబ్బందితో పెన్షన్లు ఇప్పించాలని అప్పుడు మేం కోరాం. వాళ్లు చేయలేదు. ఎందుకు జరగదో చూపిస్తామనే పట్టుదలతో వారితో ఒకేరోజు రాష్ట్రంలో పెన్షన్లు అందిస్తున్నాం, అని సీఎం వ్యాఖ్యానించారు.

# యుగ సంస్థాపకులు రాయప్రోలు...!





"ఏ దేశమేగినా ఎందుకాలిడినా/ ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన/ పొగడరా నీ తల్లి భూమి భారతిని/ నిలుపరా నీ జాతి నిండు గౌరవము"...అంటూ "జన్మభూమి" గీతాన్ని రచించి.. తెలుగు జాతి గౌరవాన్ని ఎలుగెత్తి చాటిన సుప్రసిద్ధ రచయిత, కవి రాయప్రోలు సుబ్బారావు. నవ్య కవితా పితామహునిగా పేరుపొందిన రాయప్రోలు సుబ్బారావు (మార్చి 17, 1892 – జూన్ 30, 1984) తెలుగులో భావ కవిత్వానికి ఆద్యులు. ఈయన 1913లో వ్రాసిన తృణ కంకణముతో తెలుగు కవిత్వములో నూతన శకము ఆరంభమైనదని అంటారు. జాతీయోద్యమ కవిత్వాన్ని పుష్కలంగా రచించిన కవి రాయప్రోలు సుబ్బారావు. "నాదు జాతి, నాదు దేశము, నాదు భాష అను అహంకార దర్శనమందు" అని ప్రబోధిస్తూ జాత్యభిమానం, దేశాభిమానం, భాషాభిమానం ప్రతి ఒక్కరికీ నరనరాల్లో జీర్ణించుకు పోయేలా ఆయన సృజన చేశారు. ఒక కొత్త మార్గాన్ని పలుకుబడిని, భాషను దర్శనాన్ని ఇచ్చి నూతన యుగానికి సంస్థాపకుడుగా వెలసిన వారు రాయప్రోలు సుబ్బారావు. అభినవ కవితాయుగానికి ఆయన సంస్థాపకులు. నన్నయ్య తర్వాత తెలుగు కవిత్వ భాష ఆమూలంగా పరివర్తనం పొందింది రాయప్రోలు వల్లనే. ఆయన తెలుగు సంస్కృత భాషలే కాకుండా. రవీంద్రుని ప్రభావంతో భారతీయ జాతీయతా భావాలను కొత్త ఒరవడిలో తెలుగు కవితలో ప్రవేశపెట్టారు. రాయప్రోలు పరిపక్వమతులు, పాశ్చాత్య సాహిత్య విశారదులు, నవ్య కవితోపాసకులు. పాశ్చాత్య కవుల ప్రకృతి ఆరాధనా విధానాన్ని ఆకళింపు చేసుకున్న తెలుగు కవి. పాశ్చాత్య దేశాలలో పరిమళించిన ఈ భావుకతను రాయప్రోలు తెలుగులో సుసంపన్నం చేశారు. భావ కవిత్వోద్యమానికి నాయకత్వం వహించి, తృణకంకణం, స్నేహలత, ఆంధ్రావళి, జడ కుచ్చులు లాంటి రచనలు చేసిన ఆయనకు 'కోకిలస్వామి' అనే బిరుదు ఉంది. సంస్కృత రచనలపై అతిగా ఆధారపడిన తెలుగు కవిత్వాన్ని స్వతంత్ర రచనలవైపు మళ్ళించారు. రాయప్రోలుది కేవలం అనుకరణ కాదు. తెలుగు, సంస్కృత భాషా పటిమను ఆయన వీడలేదు. సమకాలీన సమాజానికి అనుగుణంగా భావుకతను అల్లి తెలుగు కవితకు క్రొత్త సొగసులు అద్దారు. రాయప్రోలు గొప్ప జాతీయవాది. అంతేకాదు. తెలుగు జాతి అభిమాని. ఆయన దేశభక్తి గేయాలు ఎంతో ఉత్తేజకరంగా ఉంటాయి. అయన వ్రాసిన గీతాలలో అందరినోళ్లలోనూ బాగా నానిన జన్మభూమి" గీతంలో తెలుగుదనం, జాతీయాభిమానం, గత వైభవ సంకీర్తనం, ప్రబోధం లాంటివి తొణికిసలాడుతాయి. ఇప్పటికీ ఈ గీతం ఉత్తమ దేశభక్తి ప్రబోధంగా నిలిచిందనడంలో అతిశయోక్తి లేదు. "అవమానమేలరా! అనుమానమేలరా! భారతీయుడ నంచు భక్తితో పాడ...లేరురా మనవంటి వీరులింకెందు... ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో జనియించినాడ వీ స్వర్గఖండమున ఏ మంచి పూవులన్ ప్రేమించినావో నిను మోచె ఈ తల్లి కనక గర్భమున...లేదురా ఇటువంటి భూదేవి యెందూ లేరురా మనవంటి పౌరులింకెందు. సూర్యుని వెలుతురుల్ సోకునందాక ఓడలా ఝండాలు ఆడునందాక...అందాక గల ఈ అనంత భూతలిని మన భూమి వంటి చల్లని తల్లి లేదు పాడరా నీ తెలుగు బాల గీతములు పాడరా నీ వీర భావ భారతము". ఇంతకంటే గొప్ప దేశభక్తి పూరిత కవిత్వం ఇంకేముంటుంది. 1918లో ఉస్మానియా విశ్వ విద్యాలయం స్థాపించ బడి, తెలుగు శాఖ ఏర్పడటం జరిగాక, .. ఆయన ఉస్మానియా తెలుగు శాఖకు తొలి ఆచార్యుడిగా నియమింప బడ్డారు. ఆనాడు తెలుగు శాఖలో చదువుకున్న విద్యార్థుల్లో పల్లా దుర్గయ్య, అనుముల కృష్ణమూర్తి, ఠంయాల రంగాచార్యులు, అలాగే జువ్వాడి గౌతమరావు లాంటి వారు ఎందరో ఉన్నారు. 1958 ప్రాంతాల్లో జువ్వాడి గౌతమరావు జయంతి పత్రిక నడిపేవారు. దాన్లో సాహిత్యధార అనే శీర్షికను నిర్వహించేవారు. రాయప్రోలు అందులో రచనలు చేసేవారు. కాళిదాస మేము సందేశాన్ని దూత మేఘము అన్న పేరుతో యతి ప్రాసలు లేకుండా రాయప్రోలు వారు రచించగా, పలువురి విమర్శలకు గురైనారు. ఆయన ఒక పక్క కవిత్వంలో తెలుగు ప్రజల వంటి ధీరులింకెందునూ లేరని, ఏదేశ మేగినా జాతిగౌరవం నిలపాలని వ్రానస్తానే, మరొక పక్క తెలంగాణలో ప్రజలు రాజ్యంతో వీరోచితంగా పోరాడు తూండగా నైజాం రాజ్యాన్ని పొగుడుతూ రచించారన్న పేరు మూట కట్టుకున్నారు. రవీంద్రుని శిష్యుడైన రాయప్రోలు సుబ్బారావు నిజాం ప్రభువునకు అనుకూలంగా ప్రవర్తించడం.. ప్రజలకు వ్యతిరేకంగా ఉండటం నాటి జాతీయోద్యమ నాయకులకు నచ్చలేదు. ''కోకిల స్వామి'' బిరుదాంకితుడు అయిన రాయప్రోలు గురించి, కాళోజీ నారాయణరావు నా గొడవలో ...'ఓ కోయిలా.. ఏ మావి చివురులు తిని ఎవరిని పాడుతున్నావు?' రాయప్రోలును ఉద్దేశించి ఒక గేయం రాశారు. కట్టమంచి రామలింగారెడ్డి ఆయనను స్తుతించారు. రాయప్రోలు కవిత్వాన్ని జాతీయ భావ ప్రేరకంగా దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వంటి కవిత్వ ప్రేమికులు భావించి 1913 నాటి బాపట్ల ఆంధ్ర మహాసభల్లో వాటిని గానం చేయడం విశేషం. రాయప్రోలువారి సప్తతి సందర్భంలో విజయవాడలో జరిగిన సభలో...తాను రాయప్రోలు వల్ల ప్రేరణ పొందినట్లు తొలి రచనలు చేసినట్లు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పేర్కొనడం గమనార్హం.రాయప్రోలు జూన్ 30, 1984న మరణించారు.

# గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా....



దాదాభాయి నౌరోజీ కాంగ్రెస్ పార్టీకి వాస్తవానికి ప్రాతః స్మరణీయులు. ఆ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఆయన ఒకరు. మూడు పర్యాయాలు జాతీయ కాంగ్రెస్ వార్షిక సభలకు అధ్యక్షత వహించిన నాయకులు. నౌరోజీ జీవిత చరిత్ర 19 వ శతాబ్దంలో భారతీయ జాతీయవాదుల పోరాటాలను స్పష్టంగా తెలుపు తుంది. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించక ముందు నుంచే స్వాతంత్ర్యం కోసం గళమెత్తారు. నౌరోజీ, ఎ. ఓ. హ్యూమ్, దిన్షా ఎదుల్జీ వాచాతో కలిసి భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించారు. 1892 నుండి 1895 వరకు ఇంగ్లాండ్ చట్టసభ అయిన యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొనసాగారు. ఆయన ఆ పదవి పొందిన మొదటి ఆసియా వ్యక్తి. దాదాభాయ్ నౌరోజీ (సెప్టెంబర్ 4, 1825 – జూన్ 30, 1917) పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకులు, బ్రిటీష్ చట్టసభ సభ్యుడైన తొలి ఆసియా ఖండ వాసి అయిన దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4 న, బొంబాయిలో నవసారిలో ఒక పార్సీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పలన్ జీదోరోజి జొరాష్ట్రియన్ మత పురోహి తులు. బరోడా మహారాజు మూడవ శాయాజీరావు గైక్వాడ్ సహాయంతో కళాశాల ఎలిఫెన్‌స్టోన్ ఇనిస్టిట్యూట్‌లో చదివారు. తరువాత అక్కడే ఆచార్య పదవిని పొందారు. మహిళలకు విద్యను ప్రోత్స హించ డానికి జరిగిన ప్రత్యేక తరగతులలో ఆయన బోధిం చారు. తన జొరాష్ట్రియన్ మతంలో సంస్కరణల కోసం ఆయన పాటు పడ్డారు. నౌరోజీ ఆలోచనలు, ఆర్థికశాస్త్రంపై ఆధారపడినవి. కామా & కో' అనే కంపెనీలో భాగస్వామి కావడానికి 1855 సంవత్సరంలో ఆయన లండన్ వెళ్లారు. ఆ కంపెనీ లివర్‌పూల్ లో బ్రిటన్‌లో స్థాపించబడిన మొదటి భారతీయ కంపెనీగా అవతరించింది. భారత స్థితి గతులను ఆంగ్లేయులకు విడమరిచి చెప్పారు. నౌరోజీ ఇంగ్లాండ్‌లో లిబరల్ పార్టీలో చేరారు. మూడేళ్లలో దాదా భాయ్ రాజీనామా చేసి, తన సొంత వ్యాపార సంస్థ 'దాదాభాయ్ నౌరోజీ & కో.' ప్రాంభించారు. ఇంగ్లండ్‌లో భారతీయుడు స్థాపించిన తొలి వాణిజ్య సంస్థ అదే. 1865 నుండి 1866 వరకు, లండన్ విశ్వ విద్యాలయ కళాశాలలో గుజరాతీ భాషా ఉపాధ్యా యులుగా కూడా పనిచేశారు. 1865 లోనే, భారతీయ రాజకీయ, సామాజిక మరియు సాహిత్య సమస్యలు మరియు విషయాలను చర్చించి, ఇంగ్లాండ్ ఓటర్లకు అనుకూ లంగా మార్చడం ఉద్దేశ్యంతో దాదాభాయ్ నౌరోజీ 'లండన్ ఇండియన్ సొసైటీ'ని స్థాపించారు. ఆయన 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్' ఏర్పాటులో కీలక పాత్ర పోషిం చారు. అది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యొక్క ప్రధాన సంస్థ, స్థాపన ప్రధాన ఉద్దేశం బ్రిటిష్ వారి ముందు భారతీయుల శక్తిని బలోపేతం చేయడం. 1874 లో బరోడా ఇన్నిట్యూట్ యొక్క మున్షి పోస్ట్ బాధ్యతను స్వీకరిం చారు. 1875 లో, అతను బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడు అయ్యా రు. నౌరోజీ 1886 లో మొదటిసారిగా బ్రిటిష్ పార్లమెంట్ పదవి కోసం పోటీ చేసి, ఓటమి పాలు కాగా, 1892 లో తన రెండవ ప్రయ త్నంలో విజయం సాధించి, హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికైనారు. బ్రిటిష్ పార్లమెంటులో ఎన్నికైన మొదటి ఆసియా వ్యక్తిగా 1892 నుండి 1895 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా యునైటెడ్ కింగ్ డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొన సాగారు. బ్రిటిష్ పార్లమెంట్ లో భారత ఉప ఖండంలో వలస రాజ్యాల దోపిడీ సమస్యను మొదట లేవనెత్తారు. 1895 సంవత్స రానికి భారత వ్యయం పై రాయల్ కమిషన్ సభ్యులుగా కూడా నియమించ బడ్డారు. బరోడా మహారాజు శయాజీ రావు గైక్వాడ్ కాలంలో సంస్థాన దివానుగా పని చేసారు. 1874 లో, ఆయన బరోడా ప్రధాన మంత్రి, 1885 నుండి 1888 వరకు ముంబై శాసన మండలి సభ్యుడయ్యారు. అలా ప్రజా జీవితంలో ప్రవేశించిన ఆయన "గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా" గా ప్రసిద్ధి గాంచారు. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులు సురేంద్రనాథ్ బెనర్జీతో పాటు వ్యవస్థాపకుల్లో ఒకరు. 1886 లో నౌరోజీ దాని అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1893 లో లాహోరులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి రెండోసారి అధ్యక్షత వహించారు. 1906 లో జరిగిన కలకత్తా సమావేశానికి కూడా అధ్యక్షత వహించి మూడు సార్లు ఈ పదవి పొందిన తొలి నాయకులుగా అవతరించారు. దాదాబాయి నౌరోజీ పలు గ్రంథాలు రచించారు. ఆయన రాసిన పుస్తకం "పావర్టీ మరియు అన్బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా" అనే పుస్తకం భారతదేశం నుండి బ్రిటన్ తరలిస్తున్న నిధుల గురించి వివరించిన మొదటి పుస్తకం. అలాగే పార్సీల మర్యాదలు మరియు ఆచారాలు, యూరోపియన్ మరియు ఆసియటిక్ జాతులు, భారత దేశానికి కావలసినవి మరియు సాధనాలు, భారత దేశంలో పేదరికం మరియు బ్రిటిష్ రహిత నియమం, పార్సీ మతం తదితర రచనలు చేశారు. ఆయన 30 జూన్ 1917 న మరణించారు. బ్రిటిష్ పార్లమెంటులో భారతీయుల కోసం వాదించిన, బ్రిటిష్ విధానాలను విమర్శించిన నిజమైన జాతీయ వాది దాదా భాయిని ప్రతి భారతీయుడు గుర్తెరగాల్సిన అవసరం ఉంది. తరువాత అక్కడే ఆచార్య పదవిని పొందారు. మహిళలకు విద్యను ప్రోత్స హించ డానికి జరిగిన ప్రత్యేక తరగతులలో ఆయన బోధిం చారు. తన జొరాష్ట్రియన్ మతంలో సంస్కరణల కోసం ఆయన పాటు పడ్డారు. నౌరోజీ ఆలోచనలు, ఆర్థికశాస్త్రంపై ఆధారపడినవి. కామా & కో' అనే కంపెనీలో భాగస్వామి కావడానికి 1855 సంవత్సరంలో ఆయన లండన్ వెళ్లారు. ఆ కంపెనీ లివర్‌పూల్ లో బ్రిటన్‌లో స్థాపించబడిన మొదటి భారతీయ కంపెనీగా అవతరించింది. భారత స్థితి గతులను ఆంగ్లేయులకు విడమరిచి చెప్పారు. నౌరోజీ ఇంగ్లాండ్‌లో లిబరల్ పార్టీలో చేరారు. మూడేళ్లలో దాదా భాయ్ రాజీనామా చేసి, తన సొంత వ్యాపార సంస్థ 'దాదాభాయ్ నౌరోజీ & కో.' ప్రాంభించారు. ఇంగ్లండ్‌లో భారతీయుడు స్థాపించిన తొలి వాణిజ్య సంస్థ అదే.

# సవాళ్ళు ఎదుర్కొంటున్న పోస్టల్ శాఖ...!



ఎండకు భయపడక, వానకు జడవక, చలికి బెదరక, ప్రకృతి ప్రకోపాలను ఎదిరిస్తూ తన వృత్తిని నిబద్ధతతో నిర్వహించే శ్రామికువర్గాల్లో ప్రముఖ సేవకులుగా కీర్తించబడుతున్నారు నిశ్శబ్ద శ్రామిక పోస్టల్ సిబ్బంది. అనాదిగా దూరాలను చెరిపేస్తూ, ఉత్తరప్రత్యుత్తరాలను బట్వాడా చేస్తూ, ప్రతి రోజు 10 – 15 కిమీలు తమకు కేటాయించిన జనావాసాల్లో కలియతిరుగుతూ, ఇంటిల్లిపాది ఎదురు చూసే ఇష్టమైన అతిథిగా అవిశ్రాంత సేవలు అందిస్తున్న పోస్ట్‌మ్యాన్, పోస్టల్ సిబ్బంది కృషిని గుర్తించి కృతజ్ఞతలు తెలియజేయడానికి వేదికలుగా 1997 నుంచి ప్రతి ఏట 01 జూలై రోజున ప్రపంచ దేశాలు "జాతీయ పోస్టల్ కార్మికుల దినం (నేషనల్ పోస్టల్ వర్కర్స్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. అమెరికాలో ప్రారంభమైన ఈ వేడుకలు ప్రపంచ దేశాలకు విస్తరించి, ఆయా దేశాల పోస్టల్ కార్మికులను/ సిబ్బందిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ తమ కృతజ్ఞతలను ప్రకటించడానికి జాతీయ పోస్టల్ వర్కర్స్ దినం ఉపయుక్తం అవుతున్నది.

**పోస్టల్ వర్కర్స్ అమూల్య సేవలు:**

పోస్టల్ సిబ్బంది అమూల్య సేవలను ప్రస్తుతించడం, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించడం, అంకితభావంతో వారు నిర్వహించే విధుల్లో నవ్యతను జోడించడం, ప్రజల్లో వారి పట్ల సహానుభూతిని ప్రకటించడం, సమాజాభివృద్ధిలో భాగం కావడం, మెరుగైన పని తీరుకు ఆధునిక వనరులను కల్పించడం లాంటి లక్ష్యాలతో జాతీయ పోస్టల్ వర్కర్స్ దినం నిర్వహించుట జరుగుతున్నది. సకాలంలో ఉత్తరాలను గమ్యస్థానాలకు చేర్చడం, మన ఇంటి గడప వరకు పార్సల్స్‌ను మోసుకురావడం, మనీ ఆర్డర్స్ పంపిణీ చేయడం, రిజిస్టర్డ్ లెటర్స్, ఇన్సూర్డ్ కవర్ల పంపిణీ లాంటి ఉత్తమ సేవలను విపత్తులకు ఎదురీది విధులను నిర్వహించడం మన పోస్టల్ సిబ్బందికే సుసాధ్యం అయ్యింది. భారత దేశవ్యాప్తంగా 1.55 లక్షల పోస్టాఫీసుల్లో 4.04 లక్షలకు పైగా పోస్టల్ సిబ్బంది విధులు (89 శాతం గ్రామీణ ప్రాంతాల్లో) నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత విస్తృతంగా పంపిణీ వ్యవస్థ కలిగిన పోస్టల్ డిపార్ట్‌మెంట్‌గా భారత్‌కు అగ్రస్థానం ఉన్నది. కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ పరిధిలోకి వచ్చిన తపాళా శాఖ పితామహుడిగా 'రాబర్ట్ క్లైవ్'కు పేరుంది. భారత్‌లో 1766లోనే నాటి బ్రిటీష్ ఇండియాలో 'లార్డ్ రాబర్ట్ క్లైవ్' చొరవతో ముంబై, చెన్నై, కోల్కతా నగరాల్లో తపాళా సేవలు ప్రారంభమైనప్పటికీ 1854లో పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఏర్పడి, స్వాతంత్ర్య భారతంలో నేడు 23 పోస్టల్ సర్కిల్స్‌గా విస్తరించి దేశ నలుమూలల తమ సేవలను అందిస్తున్నది. భారత రక్షణ వ్యవస్థలో కూడా ప్రత్యేకమైన సర్కిల్ ఏర్పాటు చేయబడింది. భారత్‌లో 1852లో తొలిసారి పోస్టల్ స్టాంపులను వినియోగంలోకి తెరవడం, స్వాతంత్ర్యానంతరం 1947లో 'జై హింద్?' అనే నినాదంతో భారత దేశ స్టాంప్ వినియోగంలోకి వచ్చింది. 1972లో 'శ్రీరాగం బికాజీ వెలాంకర్' చొరవతో ఆరు అంకెల పిన్‌కోడ్ వ్యవస్థ ప్రారంభం కావడం జరిగింది.

# ఇజ్రాయిల్ ఆంక్షలతో గాజాలో ఆకలి మంటలు




గాజా : గత తొమ్మిది మాసాలుగా గాజాపై దాడులు కొనసాగిస్తూ, ఆహారం, ఇతర నిత్యావసరాలను ప్రజలకు అందకుండా ఇజ్రాయిల్ ఆంక్షలు కొనసాగిస్తుండడంతో లక్షలాది మంది పాలస్తీనీయులు ఆకలి మంటలతో మలమలలాడుతున్నారు. పోషకాహార లోపం తీవ్రస్థాయిలో వెంటాడుతోంది. రఫా నగరంపై పదాతిదళం దాడులు ప్రారంభించడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మే 6న ప్రారంభమైన ఈ భూతల దాడులతో పది లక్షలమందికి పైగా ప్రజలు రఫాలోని తమ సొంత నివాసాల నుంచి బలవంతంగా తరమివేయబడ్డారు. మానవతా సాయం సరఫరాలను ఇజ్రాయిల్ అడ్డుకుంటోంది. ఈ దాడులకు ముందు గాజా జనాభాలో దాదాపు సగంమంది రఫాలోనే తలదాచుకున్నారు. కానీ రఫాలో ఊచకోతతో ప్రజలకు ఆహారం అందక 5లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు కరువు కోరల్లో చిక్కుకున్నారని ఐక్యరాజ్య సమితి నిపుణుల బృందం ఆందోళన వ్యక్తం చేసింది. పదాతి దాడుల భయంతో అంతర్జాతీయ సంస్థలు మానవతా సాయాన్ని నిలిపివేశాయి. ఇప్పటికే చేరిన సరఫరాలు కూడా దాడుల భయంతో ప్రజలకు అందే పరిస్థితులు కనిపించడం లేదు. ఆకలి బాధను పడలేక దాడుల భయాన్ని కూడా పక్కనబెట్టి ఆహారం కోసం క్యూల్లో నిలుచున్నవారినీ మిలటరీ వదిలిపెట్టలేదు. రఫాలో దాడులు ప్రారంభమైన తర్వాత ప్రధాన ఆహార సరఫరాల క్రాసింగ్‌లను ఇజ్రాయిల్ మూసివేసింది. పలు ఆంక్షలను విధించింది. రాబోయే మాసాల్లో కరువు మరింత పెచ్చరిల్లే ప్రమాదం వుందని ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపిసి) తాజా విశ్లేషణలో వెల్లడైంది.

## ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో ట్రంప్ పైచేయి...!




అమెరికా అధ్యక్ష రేసులో ఎవరు ముందున్నారు ? రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ మధ్య తాజాగా జరిగిన ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో పైచేయి సాధించింది ఎవరు ? అంటే.. సర్వేలన్నీ ట్రంప్ పేరే చెబుతున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక డిబేట్‌ను నిర్వహించిన ప్రముఖ మీడియా సంస్థ 'సీఎన్ఎన్' కూడా ట్రంప్ పైచేయి సాధించారని ప్రకటించింది. ట్రంప్, బైడెన్ మధ్య డిబేట్ ముగిసిన వెంటనే సీఎన్ఎన్ ప్రసారం చేసిన పోల్ రిపోర్టులో కీలకమైన సమాచారాన్ని ప్రసారం చేశారు. "ఈ అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు ?" అని ప్రశ్నించగా 67 శాతం మంది ప్రేక్షకులు ట్రంప్‌కే ఓటు వేశారని సీఎన్ఎన్ వెల్లడించింది. కేవలం 33 శాతం మందే బైడెన్‌పై విశ్వాసం వ్యక్తం చేశారని పేర్కొంది. ఇక ట్రంప్, బైడెన్ డిబేట్‌లో ద్రవ్యోల్బణం, వలసలు, అబార్షన్ హక్కులు, విదేశాంగ విధానానికి సంబంధించిన అంశాలే ప్రధానంగా చర్చకు వచ్చాయి. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత ట్రంప్, బైడెన్ ముఖాముఖిగా చర్చలో పాల్గొనడం ఇదే తొలిసారి. కాగా, ట్రంప్ గెలుస్తాడని సర్వేలు చెబుతుండటంతో ఆయనకు చెందిన సోషల్ మీడియా కంపెనీ 'ట్రూత్ సోషల్' షేర్ల ధరలు ఒక్కసారిగా ఐదు శాతం పెరిగాయి. ఒకవేళ ట్రంప్ గెలిస్తే.. ఆయనకు అదే అతిపెద్ద గొంతుక అవుతుందని అంటున్నారు.

## 'నాపై పోక్సో కేసు కొట్టేయండి'.. హైకోర్టుకు మాజీ సీఎం యడ్యూరప్ప



**బెంగళూరు :** లైంగిక వేధింపుల కేసులో కర్ణాటక బీజేపీ నేత, మాజీ సీఎం యడ్యూరప్పకు ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది. మైనర్ బాలిక లైంగిక వేధింపుల కేసులో తనపై పోక్స్ చట్టం కింద కేసు నమోదైందని, ఆ కేసును కొట్టి వేయాలని కోరుతూ యడ్యూరప్ప కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే..ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ కేసు విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ, ఆమె కుమార్తె ఇద్దరూ డాలర్స్ కాలనీలో ఉన్న యడ్యూరప్ప నివాసానికి వెళ్లారు. అక్కడ తన కుమార్తెను యడ్యూరప్ప లైంగికంగా వేధించారని సంచలన ఆరోపణలు చేస్తూ ఓ మహిళ మార్చి నెలలో సదాశివ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. గంటల వ్యవధిలో కర్ణాటక డీజీపీ అలోక్ మోహన్ ఆ కేసును విచారణ నిమిత్తం సీఐడికి బదిలీ చేశారు. జూన్ 17న సీఐడీ అధికారులు యడ్యూరప్పను మూడు గంటల పాటు విచారించారు. పోక్స్ కేసు నమోదు చేశారు. ఆ కేసుపై మాజీ సీఎం స్పందిస్తూ 'నాపై కుట్రలకు పాల్పడే వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని' ఆయన అన్నారు. తాజాగా,ఈ కేసు దర్యాప్తు వేగవంతంగా జరగడం లేదని బాధితురాలి కుటుంబసభ్యులు కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## కొందరు ఉన్నతాధికారులకు మళ్లీ అవకాశం



**న్యూఢిల్లీ :** కేంద్ర స్థాయిలో ఉన్నత పోస్టుల్లో ఉన్న అధికారుల సర్వీసును కేంద్రంలోని మోడీ సర్కారు పొడగించాలనుకుంటున్నట్టు తెలుస్తున్నది. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన కొన్ని వారాల తర్వాత.. 1988వ బ్యాచ్ ఐపీఎస్ అధికారి, ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) చీఫ్ తపన్ కుమార్ దేకా పదవీకాలాన్ని మోడీ ప్రభుత్వం ఒక సంవత్సరం పాటు పొడిగించింది. హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన అధికారి అయిన దేకా.. 2022లో రెండేండ్ల కాలానికి ఐబీ చీఫ్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు 2025 వరకు దేకా ఈ పదవిలో ఉంటారు. ప్రధాని మోడీకి ప్రధాన కార్యదర్శిగా పి.కె మిశ్రా, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ)గా అజిత్ దోవల్‌ల సేవలను కేంద్రం పొడిగించిన విషయం విదితమే. అమిత్ ఖరే, తరుణ్ కపూర్‌లను కూడా ప్రధాని సలహాదారులుగా ప్రభుత్వం తిరిగి నియమించింది. ఈసారి ఇతర పార్టీలతో సంకీర్ణంలో ఉన్నప్పటికీ, మోడీ ప్రభుత్వ మూడవ టర్మ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఉన్నతాధికారుల కొనసాగింపుపై ప్రభుత్వం గట్టి ఆలోచనతో ఉన్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 2017 నుంచి ఆయుష్ మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా ఉన్న రాజేష్ కోటేచా కూడా ఆయన నియామకం నుంచి మూడోసారి పొడిగింపు పొందారు. అధికారులు ఇప్పటికే సర్వీస్ నుంచి పదవీ విరమణ చేసి, ప్రభుత్వం ద్వారా తిరిగి నియమించబడటంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. పీఎంఓ నియామకాలు రాజకీయ స్వభావం కలిగి ఉన్నప్పటికీ, రెండో టర్మ్ నుంచి మోడీ ప్రభుత్వం వారి నిర్ణీత పదవీ విరమణకు మించి సేవలందిస్తున్న అధికారులకు పొడిగింపులను ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నదని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పుడు కూడా ప్రభుత్వంలో పనిచేస్తున్న కొందరు ఉన్నతాధికారులు తమ నిర్ణీత పదవీకాలానికి మించి సర్వీసులు చేస్తున్నారు.

## ఇక శాశ్వత నిర్మాణాల అడుగులు



**విజయవాడ:** అమరావతి విషయంలో ప్రభుత్వం చురుకుగా ముందుకు కదులుతోంది. అమరావతిలో చేపట్టనున్న ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను నోటిఫై చేస్తూ సీఆర్డీఏ గెజిట్ జారీ చేసింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం ? అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు నిర్మించనున్నారు. ప్రభుత్వ కాంప్లెక్స్ ప్రాంతమైన 1575 ఎకరాల ప్రాంతాన్ని సిఆర్‌డిఏ నోటిఫై చేసింది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జోనింగ్ నిబంధనల ప్రకారం నోటిఫై చేశారు. రాయపూడి, నేలపాడు, లింగాయపాలెం, శాఖమూరు, కొండమరాజుపాలెం సరిహద్దుల్లో ప్రభుత్వ భవనాల కాంప్లెక్సుల్ని నిర్మిస్తారు. ఇప్పటికి సచివాలయం, హైకోర్టు వంటి వాటిని నిర్మించారు. కానీ అవి ట్రాన్సిట్ భవనాలే. మాస్టర్ ప్లాన్ లో భాగంగా నిర్మించాల్సిన అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు , రాజ్ భవన్ వంటిని నిర్మాణం చేయాల్సి ఉంది. వాటికి పునాదులు కూడా వేశారు. కానీ ఐదేళ్ల క్రితం ప్రభుత్వం మారడంతో ఆగిపోయాయి. అమరావతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలు మొత్తం 1,60,41,863 చదరపు అడుగుల్లో ఉంటాయని సీఆర్‌డీఏ గతంలో ప్రకటించింది. శాఖాధిపతుల కార్యాలయాలు, రాజ్‌భవన్, ముఖ్యమంత్రి నివాసం, మంత్రుల నివాసం, హైకోర్టు, శాసనసభ, శాసన మండలి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివాసం, అఖిల భారత సర్వీసు అధికారుల నివాస క్వార్టర్లు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస క్వార్టర్ల నిర్మాణాలకు ఎన్ని చదరపు అడుగులు అవసరమో మాస్టర్ ప్లాన్ లో ప్రకటించారు. సచివాలయాలు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు ఐకానిక్ డిజైన్ రూపొందించారు. నిజానికి సచివాలయ భవనాల నిర్మాణం కోసం 2018లోనే పునాదులు వేశారు. రాయపూడి-కొండమరాజుపాలెం వద్ద సచివాలయ భవనాల నిర్మాణానికి సంబంధించిన రాఫ్ట్ ఫౌండేషన్‌ను శరవేగంగా పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయ సముదాయాన్ని ఐదు టవర్లుగా నిర్మిస్తున్నారు. అందులో నాలుగు టవర్లు వివిధ శాఖాధిపతులకు కేటాయిస్తారు. సీఎం కార్యాలయం ఉండే ప్రధాన నిర్మాణాన్ని 225 మీటర్ల ఎత్తులో 50 అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. మొత్తం 69.8లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ టవర్ల నిర్మాణం ఉంటుంది. 225 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అతి ఎత్తయిన సచివాలయంగా ఖ్యాతి దక్కించుకోనుంది. 40 అడుగుల ఎత్తు..6.9 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణం..రెండు దశల లిఫ్ట్ విధానం ఇక్కడి ప్రత్యేకత. ఇక, 16 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు వీలుగా ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. రూఫ్ టాప్ హెలిపాడ్ కూడా ఉంటుంది.

## దక్షిణ కొరియా పాటలు విన్నాడని వ్యక్తిని ఉరితీసిన ఉత్తర కొరియా

ఉత్తర కొరియా-దక్షిణ కొరియాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం ఉందన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ ప్రజల విషయంలో చాలా కఠిన నిబంధనలు అమలు చేస్తారు.ఆ దేశంలో శత్రు దేశాల గురించి మంచిగా మాట్లాడటం కానీ, వారి సంస్కృతిని పాటించడం కానీ చేసినట్లయితే కఠినంగా శిక్షిస్తారు. ఈ క్రమంలో దక్షిణ కొరియాకు చెందిన పాటలు విన్నాడని, ఆ దేశ సినిమాలు చూశాడనే ఆరోపణలతో ఒక వ్యక్తిని బహిరంగంగా ఉరి తీసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల దక్షిణ కొరియా ఒక నివేదికను విడుదల చేసింది. దీనిలో ఉత్తర కొరియా మానవ హక్కుల గురించి వెల్లడించింది. ఈ నివేదికలో పేర్కొన్న దాని ప్రకారం, 2022లో దక్షిణ హ్వాంగ్‌హే ప్రావిన్స్‌కు చెందిన 22 ఏళ్ల వ్యక్తి 70 దక్షిణ కొరియా పాటలు విన్నాడని, అలాగే, ఆ దేశానికి చెందిన 3 సినిమాలు చూశాడని, వాటిని ఇతరులకు షేర్ చేశాడని, అతన్ని బహిరంగంగా ఉత్తర కొరియా ఉరితీసింది. ఉత్తర కొరియా తన పౌరులు వినియోగించే సమాచారంపై ఎల్లప్పుడు నిఘా వేస్తూ, కఠినమైన నియంత్రణ కలిగి ఉంది. శత్రు దేశాలకు చెందిన సినిమాలు, పాటలు ఇతర ఎంటర్‌టైన్‌మెంట్, పాశ్చాత్య సంస్కృతి వినియోగానికి సంబంధించి కఠినమైన నియమాలను అమలు



చేస్తుంది. ఒకవేళ ఎవరైనా వాటిని ఉల్లంఘించినట్లయితే చాలా కఠినమైన శిక్షలు వేస్తారు.మరోవైపు దక్షిణ కొరియా పేర్కొన్న మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలను ఉత్తర కొరియా ఖండించింది. ఆ దేశం కావాలనే తమపై తప్పుడు ప్రచారాలు చేస్తుందని, మా నాయకత్వాన్ని అణగదొక్కే ప్రయత్నాలు చేస్తుందని పేర్కొంది. ఆ దేశంలో శత్రు దేశాల గురించి మంచిగా మాట్లాడటం కానీ, వారి సంస్కృతిని పాటించడం కానీ చేసినట్లయితే కఠినంగా శిక్షిస్తారు. ఈ క్రమంలో దక్షిణ కొరియాకు చెందిన పాటలు విన్నాడని, ఆ దేశ సినిమాలు చూశాడనే ఆరోపణలతో ఒక వ్యక్తిని బహిరంగంగా ఉరి తీసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.

## తీరుమార్చుకోని మోడీ సర్కారు.....!

ఈ దఫా మోడీ నాయకత్వంలో ఏర్పడింది ఎన్‌డిఎ మిత్రమ ప్రభుత్వం గనక బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ నిరంకుశ, మతతత్వ కార్పొరేట్ ఎజెండాతో ముందుకు పోవడంలో తీవ్రమైన చిక్కులు ఎదుర్కోవలసి రావచ్చని కొన్ని వర్గాల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ ఆశాభావాల్లో కొన్ని అతి అంచనాలేనని చెప్పాలి. బిజెపి మెజార్టీ కోల్పోయి లోక్‌సభలో 240 స్థానాలకే పరిమితమైంది గనక మోడీ మూడో దఫా పాలనలో ఆయనగానీ ఆరెస్సెస్, బిజెపిలుగానీ అమలు చేయాలనుకున్న ఎజెండాలో కొన్నిటికి అదుపు చేయడం, నెమ్మదించడం జరగొచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థను, లౌకిక సూత్రాలను మరింత దెబ్బ తీసి ఏకీకృత నియంతృత్వాన్ని మళ్లీ రుద్దే విధంగా రాజ్యాంగ మార్పులు చేయడం ఇప్పుడు సాధించడం కష్టమే కావచ్చు. అయితే ఆర్థిక రంగంలో మోడీ విధానాల పరంగానూ, వ్యవస్థలను దెబ్బ తీసి నిరంకుశత్వం పెంచే పోకడలలోనూ మోడీ ప్రభుత్వ వైఖరిలో గుణాత్మకమైన మార్పేమీ వుండదు. ప్రతిపక్షంతో మోడీ సర్కారు ఘర్షణాత్మక వైఖరి, పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల తృణీకరణ పార్లమెంటు సమావేశాల ప్రారంభంలోనే కనిపించింది. కొత్త స్పీకర్‌ను ఎన్నుకునే సందర్భంలో ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ స్థానం ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించింది. ఆ విధంగా ఎన్నికపై ఏకాభిప్రాయం లేకుండా చేసింది. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం తర్వాత కొద్ది రోజులలోనే దాని నిరంకుశ నిర్బంధ పాలన నిర్మాణ చట్రం రంగంలోకి వచ్చేసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కింది కోర్టు బెయిల్ ఇస్తే హైకోర్టు కొట్టివేసింది. కేజ్రీవాల్ జైలు నుంచి బయటికి రాకుండా చేసేందుకై సిబిఐ అదే కేసులో మరోసారి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచింది. రచయిత్రి అరుంధతీ రాయ్‌పై ఒక కేసు నమోదైన తర్వాత 14 ఏళ్లకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఉపా కింద విచారణ జరిపేందుకు అనుమతి మంజూరు చేశారు. జులై 1 నుంచి మూడు నేర స్మృతులు (కోడ్స్) అంతకు ముందున్న నేర స్మృతులు శిక్షా స్మృతుల స్థానంలో అమలులోకి రానున్నాయి. ఈ కొత్త కోడ్స్‌లోని అనేక నిబంధనలు పౌరుల ప్రజాస్వామిక హక్కులపై అనేక రకాలైన ఆంక్షలు పెంచబోతున్నాయి. పౌరులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో పోలీసులకు మరిన్ని అధికారాలు కల్పించడమే గాక.. రాజద్రోహం వంటి వాటిని శిక్షించేందుకు కర్కోటకమైన అధికారాలు కట్టబెట్టనున్నాయి. అమిత్ షాను మళ్లీ హోంమంత్రిగా నియమించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ తదితర సంస్థలు ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని తమ కార్యకలాపాలు కొనసాగించబోతున్నాయి. తమకు వ్యతిరేకమైన ఏ ఇతర వ్యక్తులను లేదా వ్యవస్థలను, తమ అవసరాల కోసం బెదిరించి లొంగదీసుకోవలసిన వారి విషయంలోనూ ఇదే జరగబోతుంది.గత ప్రభుత్వ పాలన ఆఖరి దశలో తీసుకొచ్చిన టెలికాం చట్టం, ఐ.టి చట్టం నిబంధనలు ఇప్పుడు అమలులోకి రానున్నాయి. టెలికాం చట్టం 2023 జనవరి 26న పాక్షికంగా నోటిఫై అయ్యింది కూడా. బహిరంగ ఎమర్జన్సీ సమయంలో ఏ విధంగానైతే ఏదైనా మెసేజ్‌ను ఇంటర్నెట్ ద్వారా చేరవేయకుండా నిరోధించవచ్చునో ఆ విధంగా అడ్డుకోవడానికి ఈ చట్టం ప్రభుత్వానికి అవకాశమిస్తుంది. హోం శాఖ కార్యదర్శి అనుమతి వుంటే చాలు కేంద్ర సంస్థలు ఏ టెలికాం ప్రసారాన్నయినా ఆపేయడానికి 4 కేంద్ర సంస్థలకు అధికారం ఇస్తుంది. ఎన్నికల తరుణంలో బడా వాణిజ్య వర్గం నిర్ద్వంద్వంగా నరేంద్ర మోడీకి మద్దతు ఇచ్చింది. బిజెపికి మెజార్టీ రాలేదని వార్తలు రాగానే స్టాక్ మార్కెట్ వణికిపోయింది. అయితే మోడీ నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వ ఏర్పాటు గురించి ప్రకటన రాగానే ఒక్కసారిగా పైకి లేచి కూచుంది. ఆర్థిక మంత్రిగా మళ్లీ నియమితమైన నిర్మలా సీతారామన్ తన తొలి ప్రకటనలోనే తదుపరి దఫా సంస్కరణలు తక్షణం చేపడతామని ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో పొందుపరచవలసిన తమ కోర్కెల జాబితాతో బడా వాణిజ్య వర్గం ఆర్థిక మంత్రి దగ్గర మంతనాలు జరుపుతున్నది. మోడీ మూడో సర్కారు ఏర్పాటుతో కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలు పూర్తి ఊపుగా కొనసాగబోతున్నాయనే సంకేతం వస్తున్నది. నేషనల్ మానెటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి) వంటి ప్రైవేటీకరణ చర్యలు మరింతగా విచ్చుకుంటాయని భావించవచ్చు. ప్రభుత్వంలో మిత్ర పక్ష భాగస్వాములుగా వున్న తెలుగుదేశం పార్టీ, జెడి(యు) వంటి వాటి స్వభావం రీత్యా కూడా ఈ ఆర్థిక విధానాలకు ఎలాంటి ప్రతిఘటన వుండబోదని అర్థమవుతుంది. హిందూత్వ రాజకీయాల కొనసాగింపు, మైనార్టీలను లక్ష్యంగా చేసుకునే దాడుల విషయంలోనూ ఎలాంటి విరామం వుండబోదు. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి కొద్ది రోజులలోనే ఈ విషయం స్పష్టమైంది. ప్రత్యేకించి బిజెపి పాలిత రాష్ట్రాలలో ముస్లిములను లక్ష్యంగా చేసుకుని అనేక దాడి ఘటనలు జరిగాయి. చత్తీస్‌గఢ్‌లో రాయ్‌పూర్ సమీపంలోని అరంగ్‌లో పశువుల రవాణాదారులైన ముగ్గురిని మూక చంపివేసింది. పశువుల వ్యాపారం చేయడమే వారి నేరమైంది. బిజెపి పాలిత మధ్య ప్రదేశ్ మాండ్ల జిల్లాలో తమ ఇంటి రిఫ్రిజిరేటర్లలో పశుమాంసం నిల్వ పెట్టుకున్నారనే ఆరోపణలతో పదకొండు మందిని అరెస్టు చేశారు. ఆ తదనంతరం స్థానిక యంత్రాంగం అక్రమాక్రమణలనే నెపంతో ఆ పదకొండు మంది వ్యక్తుల ఇళ్లను కూల్చివేసింది. రాజస్థాన్ లోని జోధ్‌పూర్‌లో మత ఘర్షణల్లో 51 మంది అరెస్టయ్యారు. మతపరమైన విభజనతో సమీకరణలు చేయడం, మైనార్టీలు లక్ష్యంగా దాడులు జరపడం హిందూత్వ శక్తుల జీవ ధాతు రాజకీయం. కేంద్ర ప్రభుత్వం వీటిని అడ్డుకోవడం, అదుపు చేయడం జరగదు. గుర్తించవలసిన విషయమేమంటే ఈ మిత్రమ కూటమిలో బిజెపి ప్రధాన శక్తి. ఇద్దరు ప్రధాన మిత్రులుగా వున్న పార్టీలు టిడిపి, జెడి(యు)లకు ఏదైనా రాజకీయ విధానపరమైన వైఖరి తీసుకోగల శక్తిగాని, గట్టిగా నిలబడాలనే ఆసక్తి గాని లేవు.

# గుండె జబ్బు బాధితులు సొరకాయ తినొచ్చా....!




కిడ్నీల్లో రాళ్ల సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు ఆనిగెకాయను అస్సలు తినకూడదని చెబుతున్నారు. ఇలాంటి వారు పొరపాటున కూడా ఆనిగెకాయ రసం తాగకూడదని డైటీషియన్స్ అంటున్నారు. ఆనిగెకాయలో అధిక మొత్తంలో ఆక్సలేట్ ఉంటుందని, ఇది మూత్రపిండాల్లో రాళ్ల సమస్యను మరింత పెంచుతుందని సూచిస్తున్నారు. లోబీపీ సమస్య ఉన్నవాళ్లు కూడా సొరకాయకు వీలైనంత దూరంగా ఉండాలి. ఎందుకంటే ఆనిగెకాయలో ఉండే పొటాషియం రక్తపోటును తగ్గించడంలో సాయపడుతుంది. దాంతో బీపీ మరింత తగ్గుతుంది. హైబీపీకి మందులు వాడేవాళ్ల కూడా ఈ సొరకాయకు దూరంగా ఉండాలి. సడెన్‌గా బీపీ తగ్గిపోయే ఛాన్స్ ఉందంటున్నారు. బలహీనమైన జీర్ణవ్యవస్థ ఉన్నవాళ్ల కూడా సొరకాయ తినడం, దాని రసాన్ని తీసుకోవడం మానుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సొరకాయలో అధిక మొత్తంలో ఉండే ఫైబర్‌ను జీర్ణం చేయడం బలహీన జీర్ణవ్యవస్థకు సాధ్యం కాదు. కాబట్టి అలాంటివారు ఆనిగెకాయ తింటే జీర్ణవ్యవస్థ మరింత దెబ్బతింటుంది. కడుపు నొప్పి, అజీర్తి, మలబద్ధకం, విరేచనాలు లాంటి సమస్యలు వస్తాయి. పేగుల్లో పుండ్లు, అల్సర్లు లాంటి సమస్యలు ఉన్నవాళ్ల కూడా సొరకాయను తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానివల్ల జీర్ణకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పేగుల్లో వాపు, గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయని అంటున్నారు. గుండె జబ్బులతో బాధపడుతున్న వారికి కూడా సొరకాయ మంచిది కాదు. కాబట్టి వారు ఈ సొరకాయ, సొరకాయ జ్యూస్‌ను అత్యంత మితంగా తీసుకోవడం మంచిది. ఏదైనా సరే.. అతిగా తింటే ఆరోగ్య ప్రయోజనాలకు బదులుగా అనారోగ్య సమస్యలు తప్పవని వైద్యులు పదే పదే చెబుతున్నారు. లోబీపీ సమస్య ఉన్నవాళ్ల కూడా సొరకాయకు వీలైనంత దూరంగా ఉండాలి. ఎందుకంటే ఆనిగెకాయలో ఉండే పొటాషియం రక్తపోటును తగ్గించడంలో సాయపడుతుంది. దాంతో బీపీ మరింత తగ్గుతుంది. హైబీపీకి మందులు వాడేవాళ్ల కూడా ఈ సొరకాయకు దూరంగా ఉండాలి. సడెన్‌గా బీపీ తగ్గిపోయే ఛాన్స్ ఉందంటున్నారు. బలహీనమైన జీర్ణవ్యవస్థ ఉన్నవాళ్ల కూడా సొరకాయ తినడం, దాని రసాన్ని తీసుకోవడం మానుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఈ అనారోగ్య సమస్యలున్న వారు ఆ కూరగాయను తినకూడదు



శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కూరగాయలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. తీవ్రమైన అనారోగ్య సమస్యల నుంచి మనల్ని రక్షించే అనేక పోషకాలను కలిగి ఉంటాయి. వాటిలో సొరకాయ కూడా ఒకటి. దీనిలో విటమిన్ సి, ఐరన్, ఫైబర్, పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఎలాంటి అనారోగ్య సమస్యలు లేని వారికి సొరకాయ ఆరోగ్యకరమైన ఆహారం. అయితే కొందరికి ఇది మంచిది కాదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. సొరకాయను ఏ సమస్యలు ఉన్నవారు తీసుకోకూడదో ఇక్కడ తెలుసుకుందాం.. కిడ్నీలో రాళ్లతో బాధపడేవారు సొరకాయను అస్సలు తినకూడదని అంటున్నారు. అలాంటి వారు పొరపాటున కూడా సొరకాయ జ్యూస్ ని తాగకూడదని పోషకాహార నిపుణులు అంటున్నారు. ఇది కిడ్నీలో రాళ్ల సమస్యను పెంచుతుందని చెబుతారు. అధిక రక్తపోటు సమస్యలు ఉన్నవారు సొరకాయను దూరం పెట్టాలి. ఇది రక్తపోటును మరింత తగ్గిస్తుంది. అధిక రక్తపోటు కోసం మందులు తీసుకునే ఎవరైనా కూడా ఇది తినకూడదు. గుండె జబ్బులు ఉన్న వారు సొరకాయను మితంగా తీసుకోవాలి. అతిగా తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

## మల్టీవిటమిన్ టాబ్లెట్లు అతిగా వాడితే...!



మల్టీ విటమిన్లు మానవులపాలిట మరణమృదంగాన్ని మోగిస్తున్నాయంటున్నారు నిపుణులు. తాజాగా నిర్వహించిన సర్వేలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మల్టీవిటమిన్ల వాడకం ఎక్కువైతే ప్రాణాలు నిలిచే అవకాశం కంటే త్వరగా మరణించే ప్రమాదం ఉందని చెబుతున్నారు వైద్య నిపుణులు. తరచూ విటమిన్ల పేరుతో టాబ్లెట్లు తీసుకునే వారిలో.. మరణాల శాతం సాధారణం కంటే 4శాతం పెరిగిందని నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు నిర్వహించిన సర్వేలో తేటతెల్లమైంది. వీటిపై సరైన ఆధారాలు లభ్యంకానప్పటికీ దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడేవారు ఈ సబ్సిట్యూట్స్ తీసుకోవడం వల్ల అనేక సమస్యలకు గురవుతున్నట్లు చెబుతున్నారు. 60ఏళ్ల వయసు పైబడిన సుమారు 3లక్షల మందిని వైద్య పరీక్షలు చేయగా అనారోగ్య సమస్యల బారిన పడినప్పుడు మాత్రమే అధికంగా ఈ మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లను ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. అందులో విటమిన్ సి ద్వారా అధిక ప్రయోజనం పొందినట్లు తెలిపారు. దీనిని బట్టి అర్థమైంది ఏమిటంటే.. జీవితంలో పౌష్టిక ఆహారానికి మించింది మరేదీ లేదని మరోసారి రుజువైంది. అయితే వాటికి బదులుగా ఇలాంటి మల్టీ విటమిన్ సబ్సిట్యూట్లపై ఆధారపడితే కొత్త వ్యాధులు ధరిచేరతాయని హెచ్చరిస్తున్నారు వైద్య పరిశోధకులు. మనం తరచూ తీసుకునే ఆహారంలో మంచి ఫ్యాట్, విటమిన్లు, పోషకాలు, లవణాలు పుష్టిగా ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు. తద్వారా ఎలాంటి వ్యాధులనైనా ఇట్టే అధిగమించే వ్యాధినిరోధక శక్తి శరీరంలో సహజంగా ఉత్పత్తి అవుతుందని చెబుతున్నారు. ఏదైనా ఆహారం మితంగా తీసుకుంటూ అధిక పోషక విలువలు ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.

# గర్భిణీలు వీటిని అసలు తినకూడదు.....

గర్భిణీగా ఉన్నప్పుడు చాలా అనుమానాలు ఉంటాయి. ఈ సమయంలో కొన్ని ఆహారాలను తీసుకోకూడదు అని పెద్దలు చెబుతుంటే నిపుణులు మాత్రం ఎలాంటి సమస్యలు ఉండవు అంటారు. బొప్పాయి తినవద్దు అని పెద్దలు చెబుతారు. కానీ నిపుణులు మాత్రం ఎలాంటి సమస్యలు ఉండవు అంటారు. ఇలాంటి సందేహాలు చాలా ఉంటాయి. అయితే గర్భిణీ స్త్రీలు తినకూడని కొన్ని ఆహార పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. కాఫీ:కాఫీ తాగడం చాలా మందికి అలవాటు. కానీ కాఫీ గ్యాస్ ను ఫామ్ చేస్తుందట. దీని వల్ల బేబీ గ్రోత్ కు ఆటంకం కలుగుతుంది. బ్లడ్ సప్లే కూడా తగ్గుతుంది. అందుకే వీలైనంత వరకు కాఫీని స్కిప్ చేయడం బెటర్. సాధారణ సమయాల్లో కూడా టీ, కాఫీలను ఎక్కువగా తీసుకోవద్దు అని చెబుతుంటారు నిపుణులు. అందుకే మీరు గర్భిణీలు అయితే కొన్ని రోజులు అయినా కాఫీని స్కిప్ చేయండి. కూల్ డ్రింక్స్:కూల్ డ్రింక్స్ లో ఎక్కువ క్యాలరీలు ఉంటాయి. ఈ సమయంలో షుగర్ లెవల్స్ పెరుగుతాయి కాబట్టి క్యాలరీలు ఎక్కువ ఉండే కూల్ డ్రింక్స్ ను తీసుకోవద్దు. వీటి వల్ల తల్లిబిడ్డకు ప్రమాదం అంటున్నారు నిపుణులు. చైనీస్ ఫుడ్:చైనీస్ ఫుడ్ అంటే ముఖ్యంగా నూడిల్స్, మంచూరియా వంటివి గుర్తు వస్తాయి. ఇందులో అజినోమోటో ఉంటుంది కాబట్టి ఈ ఫుడ్ వల్ల మదర్, బేబీ ఇద్దరికి అనారోగ్యమే అంటున్నారు నిపుణులు. అందుకే వీటిని స్కిప్ చేయడం ఉత్తమం. పచ్చి బొప్పాయి:పచ్చి బొప్పాయి వల్ల గర్భం పోయే సమస్య ఉంటుందట. పండు బొప్పాయి తినడం వల్ల ఎలాంటి సమస్య ఉండదట. కానీ పచ్చి బొప్పాయిని మాత్రం తినవద్దు అంటున్నారు నిపుణులు. ఈ ఫ్రూట్ ను కూడా మీరు స్కిప్ చేయాల్సిందే. దీన్ని నిపుణులు మాత్రమే కాదు ఇంట్లో పెద్ద వారు కూడా స్కిప్ చేయమని చెబుతుంటారు. స్మోకింగ్, డ్రికింగ్:ఇది అబ్బాయిలకు కదా చెప్పాల్సింది అనుకుంటున్నారా.



# తరచూ బలహీనంగా అనిపిస్తుందా?



ఎల్లప్పుడూ అలసటగా, బలహీనంగా అనిపిస్తుంటుందా? కడుపు సమస్యలు, మలబద్ధకంతో బాధపడుతున్నారా? కండరాల నొప్పి కూడా వేదిస్తుందా? అయితే ఈ లక్షణాలన్నీ విస్మరించవద్దు. ఎందుకంటే ఇది విటమిన్ల లోపానికి సంకేతం. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి శరీరంలో తగినంత ప్రోటీన్, విటమిన్లు, వివిధ ఖనిజాలు పుష్కలంగా ఉండాలి. వీటిలో ఏదో ఒక లోపించినా శరీరంలో అనేక రకాల సమస్యలు తలెత్తుతాయి. విటమిన్ ఎ, సి, ఇ మాదిరిగానే విటమిన్ బి-12 కూడా శరీరానికి చాలా ముఖ్యం. ఇది ఎముకలు, కండరాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. అలాగే విటమిన్ బి-12 ఎర్ర రక్త కణాలను సృష్టించడానికి, మెదడు పనితీరును పెంచడానికి చాలా అవసరం. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. విటమిన్-బి12 శరీరానికి చాలా అవసరమైన మూలకం. దీని లోపం శరీరంలో వివిధ సమస్యలను కలిగిస్తుంది.

# రక్తపోటు అదుపులో ఉండాలంటే...!


అధిక బరువు ఉన్నవారు సులువుగా అధిక రక్తపోటు బారిన పడతారనేది అపోహ మాత్రమే. ఎందుకంటే నేటి కాలంలో సన్నగా ఉండి సాధారణ శరీర బరువుతో ఉన్నవారు కూడా అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. ప్రస్తుత కాలంలో వృద్ధులే కాదు యువకులు కూడా అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. దీనికి గల ఒకేఒక కారణం అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమరహితమైన జీవనశైలి. అధిక రక్తపోటు గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కరోనరీ హార్ట్ డిసీజ్ వంటి సమస్యలకు దారి తీస్తుంది.

అవి ప్రాణాంతకం కూడా కావచ్చు. అందువల్ల, అధిక రక్తపోటు ఉన్నవారు క్రమరహిత జీవనశైలిని నివారించడం చాలా అవసరం. అలాగే అధిక రక్తపోటుతో బాధపడేవారు వారి ఆహార అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా రక్తపోటును అదుపులో ఉంచుకోవడానికి రోజువారీ ఆహారంలో కొన్ని పండ్లు, కూరగాయలను తప్పనిసరిగా చేర్చుకోవాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పాలకూరలో నైట్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయి. అందువల్ల, అధిక రక్తపోటు ఉన్నవారు రోజువారీ




ఆహారంలో పాలకూరను చేర్చుకోవాలి. అరటిపండులో ఉండే మినరల్స్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయని పరిశోధనలు చెబుతున్నాయి. అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి డ్రై ఫ్రూట్స్‌కు సాటి మరేదీ లేదు. అందులోనూ పిస్తా పప్పులు రక్తపోటును అదుపులో ఉంచడంలో ఎంతో ఉపయోగపడతాయి. ఇందులో ప్రోటీన్, ఫైబర్ అదికంగా ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది.

## దేశంలో సగం మంది అన్‌ఫిట్టే.....!



భారత దేశంలో దాదాసు సంగం మంది ఫిజికల్‌గా ఫిట్‌గా లేరట. 50 శాతం మందికి శారీరక శ్రమ అన్న ఊసే ఎత్తడం లేదట. గ్లోబల్ హెల్త్ జర్నల్ లాన్సెట్ నిర్వహించిన స్టడీలో ఈ షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి. ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్ ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. 2022లో భారత దేశంలో దాదాపు 50 శాతం మంది తగినంత వ్యాయామం చేయడం లేదు. కనీసం వారానికి 150 నిమిషాల ఫిజికల్ యాక్టివిటీ కూడా చేయట్లేదని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం.. 18 ఏళ్లు నిండిన వారు వారానికి కనీసం 150 నిమిషాల ఫిజికల్ యాక్టివిటీ చేయాలి. లేదంటే 75 నిమిషాలు తీవ్రమైన ఫిజికల్ యాక్టివిటీ చేయాలి. దీని ఆధారంగానే 2000-2022 మధ్య కాలంలో 197 దేశాల్లో లాన్సెట్ సర్వే చేస్తోంది. దక్షిణాషియాలో మహిళల్లో తగినంత శారీరక శ్రమ లేకపోవడం, పురుషులకన్నా 14 శాతం ఎక్కువగా ఉందట. 42 శాతం పురుషులతో పోలిస్తే శారీరక శ్రమ తగినంత లేని మహిళలు 57 శాతం ఉన్నారు. ఇక లాన్సెట్ సర్వే ప్రకారం భారత దేశంలో 2000 సంవత్సరంలో 22 శాతం మంది శారీరకంగా ధృఢంగా ఉన్నారు. 2010 నాటికి వీరి సంఖ్య 34 శాతానికి పెరిగింది. ఇక 2022 నాటికి ఫిట్‌గా ఉన్నవారి సంఖ్య 50 శాతానికి పెరిగింది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే 2030 నాటికి ఫిట్‌గా ఉండే భారతీయుల సంఖ్య 60 శాతం దాటుతుందని లాన్సెట్ అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న స్త్రీ, పురుషులిద్దరిలోనూ శారీరక శ్రమ పెరుగతుందట. ఇదిలా ఉంటే.. ప్రపంచ వ్యాప్తంగా 31.3 శాతం మంది పెద్దలు (18 ఏళ్లు నిండినవారు) ఫిజికల్‌గా అన్‌ఫిట్ గా ఉన్నారని లాన్సెట్ అధ్యయనంలో తేలింది. ఈ విషయంలో మొదటిస్థానంలో ఆసియా పసిఫిక్ రీజియన్ ఉండగా, రెండో స్థానంలో దక్షిణాసియా ఉందని లాన్సెట్ పరిశోధకులు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు వారానికి కనీసం 150 నిమిషాల ఫిజికల్ యాక్టివిటీ చేయాలి. లేదంటే 75 నిమిషాలు తీవ్రమైన ఫిజికల్ యాక్టివిటీ చేయాలి. దీని ఆధారంగానే 2000-2022 మధ్య కాలంలో 197 దేశాల్లో లాన్సెట్ సర్వే చేస్తోంది. దక్షిణాషియాలో మహిళల్లో తగినంత శారీరక శ్రమ లేకపోవడం, పురుషులకన్నా 14 శాతం ఎక్కువగా ఉందట.

# ఏందీ కలెక్షన్స్

# ప్రభాస్ కల్కి నోట్ల సునామీ...




వరల్డ్ వైడ్ గా ఇండియన్ సినిమా అంటే ప్రస్తుతం వినిపిస్తోన్న పేరు కల్కి 2898ఏడీ. ఈ సినిమాపై హాలీవుడ్ క్రిటిక్స్ కూడా రివ్యూలు రాస్తున్నారు. అలాగే సినిమాలపై కంటెంట్ క్రియేట్ చేసే విదేశీ యుట్యూబ్ ఇన్ ఫ్లుయెన్సర్స్ కల్కి 2898ఏడీ మూవీ అద్భుతంగా ఉందని చెబుతూ వీడియోలు చేస్తున్నారు. దీంతో దేశంలోనే కాకుండా యూఎస్ లో కూడా ఇప్పుడు కల్కి మూవీ హాట్ టాపిక్ గా మారింది. నార్త్ అమెరికాలో కల్కి సినిమాకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఎంతలా ఉంటే కల్కి 2898ఏడీ మూవీ ప్రీమియర్స్ తో కలుపుకొని ఐదు రోజుల్లోనే 11 మిలియన్ డాలర్స్ ని కలెక్ట్ చేసింది. ఇంత తక్కువ టైంలో ఈ స్థాయి కలెక్షన్స్ అంటే రికార్డ్ అని చెప్పాలి. రాజమౌళి బాహుబలి మూవీ లాంగ్ రన్ కలెక్షన్స్ ని కల్కి మూవీ ఐదు రోజుల్లోనే నార్త్ అమెరికాలో బ్రేక్ చేసింది. ఆ విషయంలో కల్కి కి తగ్గకుండా 'పుష్ప 2'..! ప్రభాస్ సలార్ మూవీ ఓవర్సీస్ లో 15.5 మిలియన్ డాలర్స్ కలెక్షన్స్ సాధించింది. ఆ నెంబర్ ని కూడా కల్కి 2898ఏడీ బ్రేక్ చేసే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. ఓవర్సీస్ లో హైయెస్ట్ కలెక్షన్స్ అందుకున్న తెలుగు సినిమాగా బాహుబలి 2 ఉంది. ఈ మూవీ 20.77 మిలియన్ డాలర్స్ ని లాంగ్ రన్ లో కలెక్ట్ చేసింది. అయితే ఈ రికార్డ్ ని కల్కి బ్రేక్ చేస్తుందా లేదా అనేది చూడాలి. మరో వైపు వరల్డ్ వైడ్ గా చూసుకుంటే 500o కలెక్షన్స్ ని కల్కి మూవీ వసూళ్లు చేసిందని వైజయంతీ మూవీస్ అఫీషియల్ గా ప్రకటించింది. కేవలం నాలుగు రోజుల్లోనే 500o కోట్లు కలెక్షన్స్ అందుకోవడం రేర్ ఫీట్ అని చెప్పొచ్చు. కలెక్షన్స్ పరంగా ఇదే జోరు కొనసాగితే 10 రోజుల్లో 1000o కోట్లు కలెక్షన్స్ ని కల్కి రీచ్ అయ్యే అవకాశం ఉంటుందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. మూడు గంటలు నిడివి ఉన్న కూడా ప్రేక్షకులని కట్టిపడేసే విజువల్ ఎఫెక్ట్స్, బలమైన స్టోరీ నెరేషన్ కల్కి చిత్రంలో ఉంది. చిన్న చిన్న అభ్యంతరాలు ఉన్న కూడా ప్రేక్షకులను వాటిని అస్సలు పట్టించుకోవడం లేదు. కేవలం సినిమాని, నాగ్ అశ్విన్ క్రియేట్ చేసిన ఫ్యూచర్ వరల్డ్ ని తెరపై చూడటానికి ఆసక్తి చూపిస్తున్నారు. అందుకే ఈ సినిమాకి మంచి ఆదరణ లభిస్తోంది. బాహుబలి 2 తర్వాత ఆ రేంజ్ సక్సెస్ కల్కి 2898ఏడీతో ప్రభాస్ కి వచ్చినట్లే అని డార్లింగ్ ఫ్యాన్స్ అంటున్నారు. కచ్చితంగా ఈ మూవీ అన్ని రికార్డ్స్ ని బ్రేక్ చేస్తుందని బలంగా నమ్ముతున్నారు.

# పవర్‌ఫుల్ రోల్‌తో శివాజీ కమ్ బ్యాక్




నటుడిగా శివాజి సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ఇప్పటికే ఆయన 90మిడిల్ క్లాస్ అనేవెబ్ సిరీస్‌లో నటించి ఆకట్టుకున్నాడు. ఇప్పుడు దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఆయన సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తున్నాడు. అందులో భాగంగా ప్రస్తుతం ఆయన 'కూర్మనాయకి – అనే చిత్రంలో నటిస్తున్నారు. నేడు శివాజీ పుట్టిన రోజు సందర్భంగా ఆయన పాత్రని పరిచయం చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసింది మూవీ టీమ్. భారీ సోషియో ఫాంటసీగా కూర్మనాయకి సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఎంఎం క్రియేషన్స్, కాలభైరవ ప్రొడక్షన్స్ తో కలిసి రోషన్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో కె విజితా రావ్ నిర్మిస్తున్నారు. స్నిగ్ధ మణికాంత్ రెడ్డి, పూజ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటిదాకా రానటువంటి కథా కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు హర్షవర్ధన్ కడియాల. ఇందులో వరలక్ష్మీ శరత్ కుమార్, సాయి కుమార్, అతిరారాజ్, వీటీవీ గణేష్ కీ రోల్స్ లో నటిస్తున్నారు.

# ఆగస్ట్ లో వచ్చేస్తోన్న విక్రమ్ "తంగలాన్"



తమిళ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ "తంగలాన్"ను ప్రముఖ దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నేపథ్యానికి వ్యతిరేకంగా, తంగలన్ కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నివాసుల కథగా ఈ సినిమాను తెరెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, పశుపతి, పార్వతి, డేనియల్ కాల్టిగరోన్ మరియు హరికృష్ణన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే గత ఏడాది చిత్రీకరణ పూర్తయినప్పటికీ, తంగలన్ విడుదల తేదీని ఇంకా అనౌన్స్ చేయలేదు. మొదట ఈ సినిమాను జనవరి 26న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక దీంతో ఈ సినిమా మరి కొన్నిరోజుల్లో రిలీజ్ అవుతుంది అనుకొనేలోపు.. ఈ సినిమా వాయిదా పడినట్లు మేకర్స్ అధికారికంగా తెలిపారు. తరువాత సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్ ను రిలీజ్ చేసింది. ఇక ఈ సినిమా ఏప్రిల్ లో రిలీజ్ కానున్నట్లు మేకర్స్ తెలిపారు. అదికూడా పోస్టుపోన్ అయ్యింది. ఇప్పుడు మళ్లి మేకర్స్ కొత్త రిలీజ్ డేట్ అనౌన్స్ చేసారు.అల్లు అర్జున్ పుష్ప 2: ది రూల్ సినిమా పోస్టుపోన్ కావడంతో చాలా చిన్న సినిమాలు ఆగస్ట్ 15న రిలీజ్ అయ్యేందు రెడీ అయ్యాయి. ఇప్పుడు విక్రమ్ సినిమా కూడా ఆగష్టు లో రిలీజ్ కానున్నట్లు మేకర్స్ తెలిపారు. ఎడారిలో విక్రమ్.. మోకాలు వంచి కూర్చొని యుద్దానికి సిద్ధం అన్నట్లు సీరియస్ లుక్ లో కనిపించాడు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తి పెంచాయి. ఈ సినిమాను తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో రిలీజ్ కాబోతుంది.

# దేవయాని.... ఆరబోత...



నార్త్ ఇండియన్ బ్యూటీస్ కి సౌత్ లో ఎప్పుడు డిమాండ్ ఉంటుంది. సైతాన్, సేవ్ ది టైగెర్స్ వంటి వెబ్ సిరీస్ ల ద్వారా పాపులర్ అయిన నార్త్ ఇండియన్ బ్యూటీ దేవియాని శర్మ. ఈ అమ్మడు సైతాన్ లో చేసిన భయంకరమైన పెర్ఫార్మెన్స్ ని ఎవరు కూడా మర్చిపోరు. అలాగే సేవ్ ది టైగెర్స్ లో కార్పొరేట్ విమెన్ గా అదే స్థాయిలో ఆటిట్యూడ్ ఉన్న క్యారెక్టర్ లో నటించి మెప్పించింది. మహి వి రాఘవ దర్శకత్వంలో వచ్చిన ఈ సిరీస్ లతో దేవియాని శర్మకి టాలీవుడ్ లో మంచి గుర్తింపు వచ్చింది. రొమాంటిక్ మూవీతో ఈ బ్యూటీ టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. తరువాత సినిమాలలో పెద్దగా అవకాశాలు రాకపోయిన వెబ్ సిరీస్ లలో మాత్రం ఛాన్స్ లు అందుకుంది. అనగనగా అనే వెబ్ సిరీస్ లో కూడా నటించింది. అయితే దేవియాని శర్మకి బాగా పేరు తీసుకొచ్చింది మాత్రం సైతాన్ అని చెప్పాలి. ఇదిలా ఉంటే ఈ హాట్ బ్యూటీ ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన హాట్ అండ్ గ్లామరస్ ఫోటోలని షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ తన ఇన్ స్టాగ్రామ్ లో బ్లాక్ కలర్ సింగిల్ పీస్ బికినీలో అదిరిపోయే ఫోటోని షేర్ చేసింది. ఈ ఫోటో కాస్తా ఇప్పుడు వైరల్ అవుతోంది. దేవయాని శర్మ బికినీలో అదిరిపోయిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# డాక్టర్ రెడ్డీస్ నుంచి పెర్టుజుమ్యాబ్ బయోసిమిలర్ ఔషధం

రొమ్ము క్యాన్సర్ చికిత్సలో వినియోగించే పెర్టుజుమ్యాబ్ బయోసిమిలర్ ఔషధాన్ని మనదేశంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, జైడస్ లైఫ్ సైన్సెస్ ఉమ్మడిగా విక్రయించనున్నాయి.దీనిపై రెండు కంపెనీల మధ్య లైసెన్సింగ్ ఒప్పందం కుదిరింది. ఈ బయోసిమిలర్ ఔషధాన్ని జైడస్ రీసెర్చ్ సెంటర్ (జడ్ఆర్సీ)లోని శాస్త్రవేత్తల బృందం సొంతంగా అభివృద్ధి చేసింది. రెండు కంపెనీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం డాక్టర్ రెడ్డీస్‌కు ఈ మందుపై జైడస్ నుంచి 'సెమీ-ఎక్స్‌క్లూజివ్' హక్కులు లభిస్తాయి. దీని కోసం జైడస్‌కు లైసెన్సింగ్ ఫీజును డాక్టర్ రెడ్డీస్ చెల్లిస్తుంది. పెర్టుజుమ్యాబ్ బయోసిమిలర్ ఔషధాన్ని డాక్టర్ రెడ్డీస్ 'వుమ్యాబ్' అనే బ్రాండుతో విక్రయిస్తుంది. అదే సమయంలో జైడస్ దీన్ని 'సిగ్రిమా' అనే పేరుతో విడుదల చేస్తుంది. రొమ్ము క్యాన్సర్ (హెర్2 పాజిటివ్) వచ్చిన వారికి కీమోథెరపీ, ట్రస్టుజుమ్యాబ్, పెర్టుజుమ్యాబ్ మందులు వినియోగిస్తారు. డాక్టర్ రెడ్డీస్ ఇప్పటికే హెర్విక్టా అనే బ్రాండు పేరుతో ట్రస్టుజుమ్యాబ్ బయోసిమిలర్ ఔషధాన్ని విక్రయిస్తోంది. పెర్టుజుమ్యాబ్ మందును కూడా ఇప్పుడు అందుబాటులోకి తీసుకువస్తున్నందున రొమ్ము క్యాన్సర్ బాధితులకు పూర్తి చికిత్సను తాము అందించినట్లు అవుతుందని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. సరైన చికిత్స తీసుకోని పక్షంలో హెర్2 పాజిటివ్ రొమ్ము క్యాన్సర్ వేగంగా విస్తరిస్తుంది. ఏటా 2 లక్షలకు పైగా రొమ్ము క్యాన్సర్ కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఇందులో 25 శాతం కేసులు హెర్2 పాజిటివ్ కేసులు ఉంటున్నాయి. జైడస్‌తో ఒప్పందం వల్ల మనదేశంలో ఎక్కువ మందికి పెర్టుజుమ్యాబ్ మందును అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఏర్పడినట్లు డాక్టర్ రెడ్డీస్ వివరించింది.




## ఏటీఎమ్ కార్డు ఉందా..?




ప్రస్తుతం బ్యాంక్ ఖాతా లేని వారు లేరని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వ పథకాలు మొదలు అన్నింటికీ బ్యాంకు ఖాతా అనివార్యంగా మారింది. దీంతో సహజంగానే ఏటీఎమ్‌ల వినియోగం కూడా పెరిగింది. వీటిలో డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు ఉంటాయని తెలిసిందే. అయితే మనం ఉపయోగించే ఏటీఎమ్ కార్డులపై బీమా ఉంటుందని మీలో ఎంత మందికి తెలుసు. అవును కార్డుల ఆధారంగా ఏకంగా రూ. 10 లక్షల వరకు కూడా బీమా అందిస్తారు. ఇంతకీ ఏ కార్డులపై ఎంత బీమా వర్తిస్తుంది.? వీటిని ఎలా క్లెయిమ్ చేసుకుంటారో ఇప్పుడు తెలుసుకుందాం.. ఎస్‌బీఐ గోల్డ్ మాస్టర్ కార్డ్ లేదా వీసా కార్డ్ కలిగి ఉన్న వారికి రూ. 4 లక్షల ఎయిర్ డెత్ (విమాన ప్రమాదాల్లో మరణిస్తే), రూ. 2 లక్షల నాన్ ఎయిర్ ఇన్సూరెన్స్ కవర్ అవుతుంది. ఇక ప్రీమియం కార్డ్ హోల్డర్స్‌కు రూ. 10 లక్షల ఎయిర్ డెత్, రూ. 5 లక్షల నాన్ ఎయిర్ కవర్ లభిస్తుంది. కాగా సాధారణ మాస్టర్‌కార్డ్‌పై రూ. 50 వేలు, ప్లాటినం మాస్టర్‌కార్డ్‌పై రూ. 5 లక్షల రూపాయలు, వీసా కార్డుపై రూ. 2 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తారు. అలాగే ప్రధాన మంత్రి జనధన్ యోజన కింద ఓపెన్ చేసిన వారికి రూ. 1 నుంచి రూ. 2 లక్షల వరకు ఇన్సూరెన్స్ లభిస్తుంది.

## ఈవీలకు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీ కార్లు...!




భారతదేశంలో ఇటీవల కాలంలో కార్ల కొనుగోలు తారాస్థాయికు చేరింది. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు సొంతకారు కొనుగోలు చేయాలనే కలను నిజం చేసుకోవడానికి వాహన రుణాల సౌకర్యంతో సొంత కార్లను కొనుగోలు చేస్తున్నారు. అయితే కారు కొనుగోలు చేసినా దాని నిర్వహణ విషయంలో ప్రతి ఒక్కరూ ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా పెరుగుతున్న పెట్రోల్ ధరల దెబ్బకు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో అందుబాటులోకి వచ్చిన ఈవీ కార్లు పెద్దగా మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకోవడం లేదు. కాబట్టి ఇటీవల కాలంలో సీఎన్‌జీ కార్ల కొనుగోళ్లకు అంతా ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటికే ఉన్న కార్లను కూడా సీఎన్‌జీగా అప్‌గ్రేడ్ చేసుకునే సౌకర్యం ఉండడంతో చాలా మంది ఈ పని చేస్తున్నారు. అయితే ఈ కార్లు అధిక మైలేజ్‌ను ఇవ్వడంతో సీఎన్‌జీ సౌకర్యం ఉన్న కార్ల కొనుగోలుకు చాలా మంది ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులోకి రానున్న సీఎన్‌జీ కార్ల గురించి తెలుసుకుందాం. మారుతి స్విఫ్ట్ సీఎన్‌జీ మేక్‌కర్వ్‌తో వస్తుంది. కొత్త స్విఫ్ట్, 3-సిలిండర్ జెడ్ 12ఈ ఇంజన్‌తో ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ సీఎన్‌జీ పర్యావరణ అనుకూలమైన, బడ్జెట్ ధరలకు డిమాండ్ ఉన భారతీయ మార్కెట్లో లాంచ్ కానుంది. అయితే ఈ సీఎన్‌జీ కారు అధికారిక విడుదల తేదీనీ మారుతీ ధ్రువీకరించలేదు. ముఖ్యంగా పెరుగుతున్న పెట్రోల్ ధరల దెబ్బకు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో అందుబాటులోకి వచ్చిన ఈవీ కార్లు పెద్దగా మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకోవడం లేదు. కాబట్టి ఇటీవల కాలంలో సీఎన్‌జీ కార్ల కొనుగోళ్లకు అంతా ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటికే ఉన్న కార్లను కూడా సీఎన్‌జీగా అప్‌గ్రేడ్ చేసుకునే సౌకర్యం ఉండడంతో చాలా మంది ఈ పని చేస్తున్నారు.

## తక్కువ ధరలో మంచి కార్ల కోసం చూస్తున్నారా...?





తక్కువ ధరలో అందుబాటులో ఉన్న బెస్ట్ కార్లలో హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ ఒకటి. ఈ కారు ప్రారంభ వేరియంట్ ధర రూ. 5.84 లక్షల ఎక్స్ షోరూమ్ ప్రైజ్‌గా ఉంది. ఇందులో ఆరు ఎయిర్ బ్యాగ్స్ అందించారు. ఇక ఈ కారులో 1.2 లీటర్ నేచురల్లీ యాస్పిరేటెడ్ ఇంజిన్‌ను ఇచ్చార. సీఎన్‌జీ ఆప్షన్ కూడా అందుబాటులో ఉంది. టాటా పంచ్ కూడా తక్కువ బడ్జెట్‌లో అందుబాటులో ఉంది. ఈ కారు ప్రారంభ వేరియంట్ ఎక్స్ షోరూమ్ వేరియంట్ ధర రూ. 5.99 లక్షలుగా ఉంది. ఇక ఈ కారులో 1.2 లీటర్ నేచురల్లీ యాస్పిరేటెడ్ ఇంజిన్ అందించారు. 5 స్పీడ్ మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్లలో తీసుకొచ్చారు సీఎన్‌జీ ఆప్షన్ కూడా అందించారు. కాస్త ధర ఎక్కువే అయినా మినీ ఎస్‌యూవీని తలపించే హ్యుందాయ్ ఎక్స్‌టర్ బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు. ఈ కారు ఎక్స్ షోరూం ప్రైజ్ రూ. 6.12 లక్షల నుంచి మొదలవుతుంది. ఈ కారు 5 స్పీడ్ మాన్యువల్ లేదా ఆటోమేటిక్ మోడల్స్‌లో అందుబాటులో ఉంది. సీఎన్‌జీ ఆప్షన్‌లో కూడా అందుబాటులో ఉంది. భద్రతతో పాటు మంచి ఫీచర్లతో కూడిన మరో కారు టాటా టియాగో.

## ఈ రైల్వే స్టాక్ హాట్ కేక్...!



ప్రస్తుతం మార్కెట్లో అత్యధిక రాబడినిచ్చే మార్గాలు ఏమైనా ఉన్నాయంటే అది షేర్, స్టాక్ మార్కెట్లని కచ్చితంగా చెప్పొచ్చు. అయితే వాటిల్లో ఎంత రాబడి ఉంటుందో.. అంతే స్థాయిలో రిస్క్ కూడా ఉంటుంది. పరిస్థితులు వేగంగా మారిపోతుంటాయి. మార్కెట్ ఎప్పుడు ఎలా స్పందిస్తుందో అంచనా వేయడం, అర్థం చేసుకోవడం అంత సులభమైంది ఏమి కాదు. అయితే దానిపైనే ఉండే కొంతమంది నిపుణులు మాత్రం ఏ స్టాక్ పుంజుకుంటుంది? ఏ స్టాక్ లో పెట్టుబడులు పెడితే దీర్ఘకాలంలో మంచి లాభాలు వస్తాయన్న అంశాలను లెక్కించి సూచనలు చేస్తుంటారు. అలాగే ప్రస్తుతం భారతీయ రైల్వేకు ఫైనాన్సింగ్ చేసే ఓ కంపెనీకి ఓ మల్టీ బ్యాగర్ స్టాక్ గురించి అంతా చర్చించుకుంటున్నారు. ఇది దీర్ఘకాలం సస్టైన్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆ స్టాక్ ఏంటి? దాని పరిస్థితి ఏంటి? తెలుసుకుందాం రండి.. రైల్వే పీఎస్‌యూ స్టాక్ ఐఆర్ఎఫ్‌సీని దీర్ఘకాలానికి కొనుగోలు చేయాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

## ప్రాథమిక డీమ్యాట్ ఖాతా పరిమితి రూ.10 లక్షలకు పెంపు




సెక్యూరిటీల మార్కెట్‌లో చిన్న మదుపర్ల ప్రాతినిధ్యం పెంచేందుకు, ప్రాథమిక సేవల డీమ్యాట్ ఖాతా (బీఎస్‌డీఏ) పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సెబీ తెలిపింది.కొత్త మార్గదర్శకాలు సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయని సర్క్యులర్‌లో పేర్కొంది. సాధారణ డీమ్యాట్ ఖాతాతో పోలిస్తే బీఎస్‌డీఏ పరిమాణం తక్కువగా ఉంటుంది. చిన్న పోర్ట్‌ఫోలియోలు కలిగిన మదుపర్లపై డీమ్యాట్ ఛార్జీల భారం తగ్గించేందుకు 2021లో సెబీ ఈ సదుపాయాన్ని తీసుకొచ్చింది. అన్ని డిపాజిటరీల్లో ఒక పేరు మీద ఒకటే బీఎస్‌డీఏను అనుమతిస్తారు. ఇందులో డెట్, నాన్ డెట్ సెక్యూరిటీల విలువ రూ.10 లక్షలను మించకూడదు. ఇంతకు ముందు రూ.2 లక్షల వరకు డెట్ సెక్యూరిటీలకు అనుమతించేవారు. రూ.4 లక్షల వరకు పోర్ట్‌ఫోలియో విలువ ఉంటే ఎటువంటి వార్షిక నిర్వహణ ఛార్జీలు ఉండవు. రూ.4-10 లక్షల పోర్ట్‌ఫోలియో విలువపై రూ.100 ఛార్జీ వసూలు చేస్తారు. రూ.10 లక్షల విలువ దాటితే బీఎస్‌డీఏ ఖాతా ఆటోమేటిక్‌గా సాధారణ డీమ్యాట్ ఖాతాగా మారిపోతుంది.

## మార్కెట్‌కు ఎలక్ట్రిక్ కిక్.....

భారతదేశంలోని ఆటో మొబైల్ మార్కెట్‌కు ఎలక్ట్రిక్ కిక్ వచ్చింది. ఎప్పటికప్పుడు మార్కెట్‌లోకి ఎలక్ట్రిక్ వాహనాలు రిలీజ్ అవుతున్నాయి. తాజాగా ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ జీటీ ఫోర్స్ తన సరికొత్త ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ జీటీ టెక్సాను విడుదల చేసింది. ఈ బైక్ ధర రూ. 1,19,555 (ఎక్స్-షోరూమ్)గా ఉంది. ఈ కొత్త బైక్ అధునాతన సాంకేతికత, అధిక పనితీరు, పర్యావరణ అనుకూల ఫీచర్లతో పట్టణ రైడర్ల అవసరాలను తీర్చడానికి రూపొందించారు. ఈ నేపథ్యంలో జీటీ టెక్సా ఈవీ బైక్ గురించి వివరాలను తెలుసుకుందాం. జీటీ టెక్సా నలుపు, ఎరుపు అనే రెండు రంగులలో లభిస్తుంది. రిమోట్ లేదా కీని ఉపయోగించి ఈ



బైక్‌ను ప్రారంభించవచ్చు. 17.78 సెం.మీ ఎల్ఈడీ డిస్ ప్లే స్పష్టమైన సమాచారాన్ని అందిస్తుంది.

## ఈ ఏడాది పూర్తి బడ్జెట్ ఫిబ్రవరిలో కాకుండా జూలైలో ఎందుకు సమర్పిస్తున్నారు...?

జూలై మూడో వారంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇది పూర్తి బడ్జెట్. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి సీతారామన్. 7 బడ్జెట్‌లు సమర్పించిన రికార్డును ఆమె సొంతం చేసుకున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1, 2024న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పుడు పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను జూలైలో ప్రవేశపెట్టనున్నారు. అయితే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు జూలై నెలనే ఎందుకు ఎంచుకున్నారో తెలుసుకుందాం. లోక్‌సభ ఎన్నికలు లేని సంవత్సరంలో సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అంటే, కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తారు. ఎన్నికలు జరిగిన ఏడాదిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అందులో పరిపాలనా, ఆర్థిక వ్యయాలను కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తుంది. ఇది పరిపాలనా ఖర్చులు, ఉద్యోగుల జీతం, ఇతర ఖర్చులను అందిస్తుంది. ఇప్పుడు పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను జూలైలో ప్రవేశపెట్టనున్నారు. అయితే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు జూలై నెలనే ఎందుకు ఎంచుకున్నారో తెలుసుకుందాం. లోక్‌సభ ఎన్నికలు లేని సంవత్సరంలో సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అంటే, కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తారు.ఎన్నికల ఫలితాల తర్వాత సాధారణ బడ్జెట్‌లో అనేక కొత్త పథకాలు, పాత పథకాలు, రాయితీలు, పన్నుల నిర్మాణాలు చేపట్టారు. ఈ ఏడాదిలో ఎన్నికలు జరిగాయి కాబట్టి ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టి పూర్తి స్థాయి బడ్జెట్ జూలై నెలలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యంతర బడ్జెట్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఇప్పుడు పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను జూలైలో ప్రవేశపెట్టనున్నారు. అయితే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు జూలై నెలనే ఎందుకు ఎంచుకున్నారో తెలుసుకుందాం. లోక్‌సభ ఎన్నికలు లేని సంవత్సరంలో సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అంటే, కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తారు. ఎన్నికలు జరిగిన ఏడాదిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అందులో పరిపాలనా, ఆర్థిక వ్యయాలను కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తుంది. ఇది పరిపాలనా ఖర్చులు, ఉద్యోగుల జీతం, ఇతర ఖర్చులను అందిస్తుంది. ఎన్నికల ఫలితాల తర్వాత సాధారణ బడ్జెట్‌లో అనేక కొత్త పథకాలు, పాత పథకాలు, రాయితీలు, పన్నుల నిర్మాణాలు చేపట్టారు. ఈ ఏడాదిలో ఎన్నికలు జరిగాయి కాబట్టి ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టి పూర్తి స్థాయి బడ్జెట్ జూలై నెలలో ప్రవేశపెట్టనున్నారు.



# పరువు నష్టం దావాలో మేధా పాట్కర్‌కు ఐదు నెలల జైలు శిక్ష



న్యూఢిల్లీ: 23 ఏళ్ల క్రితం నాటి పరువు నష్టం దావా కేసులో ఢిల్లీ కోర్టు ప్రముఖ సామాజిక కార్యకర్త మేధా పట్కర్ కు ఐదు నెలల జైలు శిక్ష విధించింది. ఒకప్పుడు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ అనే లాభేతర సంస్థ అధ్యక్షుడి గా ఉన్న వికె.సక్సేనా ఆమెపై పరువు నష్టం దావా వేశారు. ఆయన నేడు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ గా పనిచేస్తున్నారు. ఆయన పరవుకు భంగం కలిగించినందుకు గాను రూ. 10 లక్షలు పరిహారం చెల్లించాలని కూడా కోర్టు ఆదేశించింది. కాగా కోర్టు ఆమె జైలు శిక్షను క్రిమినల్ ప్రొసీడర్ కోడ్ 389(3) కింద ఆగస్టు 1 వరకు సస్పెండ్ చేసింది. ఆమె ఈ ఉత్తర్వు మీద అప్పీలు చేసుకోడానికి ఆ వెసలుబాటు కల్పించింది. పరిశీలన షరతు(ఆన్ కండిషన్ ఆఫ్ ప్రొబేషన్) కింద తనను విడిచిపెట్టాలని ఆమె విన్నవించుకోగా, జడ్జీ "వయస్సు, నొప్పులు, నష్టాల దృష్ట్యా తీవ్ర శిక్ష విధించాలనుకోవడం లేదు" అన్నారు. ఢిల్లీ కోర్టు మే 24న మేధా పాట్కర్ ను ఐపిసి 500 సెక్షన్ కింద దోషిగా తేల్చింది. ఆమెకు గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష లేక జరిమానా లేక రెండూ వేయొచ్చని కోర్టు తేల్చింది. మేధా పాట్కర్ కు, వికె. సక్సేనా మధ్య న్యాయపోరాటం 2000 నుంచి ఉంది. తన మీద, నర్మద బచావో ఆందోళన్(ఎన్ బిఏ)కు వ్యతిరేకంగా ప్రకటనలు ప్రచురించినందుకుగాను ఆమె దావా వేసింది. 'ట్రూ ఫేస్ ఆఫ్ ప్యాట్రియట్' శీర్షికతో పాట్కర్ ఓ పత్రికా ప్రకటన వెలువరిచారు. ఆ ప్రకటన 2000 నవంబర్ 25న వెలువడింది. కోర్టు ఉత్తర్వు మీద పాట్కర్ స్పందిస్తూ "నిజం ఎప్పుడు ఓడిపోదు... మేము ఎవరినీ అగౌరవపరచలేదు, మేము కేవలం కష్టిస్తాము... మేము కోర్టు తీర్పును సవాలు చేస్తాం" అన్నారు.

# నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి : కెటిఆర్




హైదరాబాద్: తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ హాస్పిటల్ వద్ద నిరుద్యోగ యువకులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయటాన్ని కెటిఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. నిరుద్యోగ హక్కుల కోసం దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను పరామర్శించేందుకు వెళితే నిరుద్యోగ యువకులపై లాఠీఛార్జ్ చేయుటమేమిటంటూ మండిపడ్డారు. ప్రజాపాలనలో పరామర్శించటం, నిరసన తెలిపే హక్కు కూడా లేదా..? అని ప్రశ్నించారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఆక్షేపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే నిరుద్యోగులను తరుముతూ పోలీసులు లాఠీఛార్జ్ చేశారని ఒక ప్రకటనలో ఆరోపించారు. నిరుద్యోగ యువకుల కోసం దీక్ష చేస్తున్న మోతీలాల్ పరామర్శించేందుకు వెళ్లిన బిఆర్ఎస్ పార్టీ ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం నాయకుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డి సహా పలువురు ప్రజా ప్రతినిధులకు కూడా పోలీసులు అడ్డుకుని మోతీలాల్ కలవకుండా అడ్డుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న పార్టీ నాయకులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువకుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా వారికి సంఘీభావం తెలుపుతున్న యువకులు, ప్రతిపక్షాల నాయకులను అడ్డుకోవడం ప్రభుత్వ దమన నీతికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అప్రజాస్వామ్య చర్యలను మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. నిరుద్యోగులు, యువకులు డిమాండ్ చేస్తున్నట్లుగా ఉద్యోగ నోటిఫికేషన్‌లను వెంటనే జారీ చేయాలని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రక్రియ ప్రారంభించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను కెటిఆర్ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న నిరుద్యోగులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నిరుద్యోగుల డిమాండ్లను పట్టించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# జైలులో ఉన్న ఇంజినీర్ రషీద్ ప్రమాణ స్వీకారానికి ఎన్ఐఎ అనుమతి



న్యూఢిల్లీ : ఉగ్రనిధుల కేసు నిందితుడు ఇంజినీర్ రషీద్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. అతడు ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సమ్మతి తెలియజేసింది. దీనిపై ఢిల్లీ హైకోర్టు తుది ఆదేశాలు వెలువరించాల్సి ఉంది. జమ్ముకశ్మీర్‌కు చెందిన షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ బారాముల్లా నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రుడిగా పోటీ చేసి, విజయం సాధించారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత , మాజీ సిఎం ఒమర్ అబ్దుల్లాపై 2 లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రకార్యకలాపాలకు నిధులు సమకూర్చారన్న అభియోగాలపై 2019 ఆగస్టులో అరెస్టయ్యారు. ప్రస్తుతం అతడు జైల్లో ఉండటంతో మిగతావారితోపాటు 18 వ లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేయలేకపోయారు. తన ప్రమాణస్వీకారం కోసం మధ్యంతర బెయిల్ కోరుతూ రషీద్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. మనీలాండరింగ్ కేసులో తీహార్ జైలులో ఉన్న సమయంలో పార్లమెంట్‌కు వచ్చి, ఆప్ నేత సంజయ్‌సింగ్ రాజ్యసభ ఎంపీగా ప్రమాణం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై స్పందించాలని జులై ఒకటిలోగా సమాధానం ఇవ్వాలని ఎన్ఐఎ కోర్టు ఆదేశించింది. ఈ క్రమం లోనే ఎన్ఐఏ తన సమ్మతిని తెలియజేసింది. దీనిపై మంగళవారం కోర్టు తుది తీర్పు ఇవ్వనుంది. ఇదిలా ఉంటే పంజాబ్ లోని ఖడూర్ సాహిబ్ స్థానం నుంచి వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ గెలుపొందిన సంగతి తెలిసిందే. అతడు కూడా ఇంకా ప్రమాణస్వీకారం చేయలేదు. ప్రస్తుతం అతడు కూడా జైల్లోనే ఉన్నాడు.

# ఆర్‌టిసి బస్సుల్లో డిజిటల్ సేవలు

హైదరాబాద్: ఆర్‌టిసి బస్సుల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. చిల్లర సమస్యను అధిగమించేందుకు డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రవేశ పెట్టే యోచనలో తెలంగాణ ఆర్‌టిసి ఉంది. ఇప్పటికే హైదరాబాద్, బండ్లగూడ డిపోలోని కొన్ని బస్సుల్లో ఈ డిజిటల్ పేమెంట్స్ విధానం విజయవంతంగా అమలవుతోంది. దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. డిజిటల్ పేమెంట్ కోసం ఇంటెలిజెంట్ టికెట్ ఇష్యూ మిషన్ పేరుతో ఐటిమ్స్‌ను ప్రవేశ పెట్టింది. బండ్లగూడలోని బస్సులతోపాటు సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో దీన్ని 3 నెలలుగా అమలు చేస్తున్నారు. అక్కడ ప్రయోగం విజయవంతం కావడం, వేరే సమస్యలు రాకపోవడం, చిల్లర బాధలు కూడా తీరడంతో తెలంగాణ వ్యాప్తంగా దీన్ని ప్రవేశ పెట్టాలని భావిస్తున్నారు. ప్రయాణికుడి వద్ద నగదు లేకపోయినా కార్డు, ఫోన్‌పే, గూగుల్ పే లాంటి పేమెంట్స్ యాప్ ద్వారా బస్సులో టికెట్ తీసుకోవచ్చు. ఇలా చేస్తే ఇకపై చిల్లర సమస్య అనేదే ఉండదు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉచిత ప్రయాణం మరింత సౌకర్యవంతంగా సాగేలా చర్యలకు ఉపక్రమిస్తోంది.




ఇప్పటికే ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. దీనిని మరింత సులభతరం చేసేందుకు ఆర్‌టిసి యోచిస్తోంది. ఉచిత ప్రయాణం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలని ఆర్‌టిసి నిర్ణయం తీసుకుంది.

# బాలల హక్కుల పరిరక్షణ సారథికి జాతీయ పురస్కారం



న్యూఢిల్లీ: నేటి బాలలే భావి భారత సారథులు... అలాంటి బాలల హక్కుల సంరక్షణలో గత రెండేళ్లలో విశేష కృషి చేసి ఎన్‌టీఆర్ జిల్లాను అత్యుత్తమ ప్రగతి సాధించిన జిల్లాగా నిలిపినందుకు అప్పటి కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు జాతీయస్థాయి పురస్కారం లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ చేతులమీదుగా డిల్లీరావు అవార్డు అందుకున్నారు. రేపటి పౌరులైన బాలల భవితవ్యానికి హక్కుల సంరక్షణతో బంగారు బాటలు వేయడంలో చిత్తశుద్ధితో చేసిన కృషి భేష్ అంటూ ప్రశంసలు అందుకున్నారు.

**నిత్య నూతనంగా, వినూత్నంగా...**

మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాను అడ్డుకోవడంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తూ, చిన్నారులు చెడు అలవాట్లవైపు మళ్లకుండా వినూత్న కార్యక్రమాలు అమలుచేయడంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్‌గా గత రెండేళ్లలో డిల్లీరావు విశేష కృషిచేశారు. ఎన్‌సీపీసీఆర్, ఎన్‌సీబీల ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక (జేఏపీ) అమల్లోనూ తనదైన ముద్ర వేశారు. ఎప్పటికప్పుడు వినూత్నంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లి.. మెరుగైన ఫలితాలు సాధించారు. పోలీస్, ఐసీడీఎస్ వంటి సమన్వయ శాఖలు.. చైల్డ్‌లైన్, ఫోరం ఫర్ ఛైల్డ్ రైట్స్, నవజీవన్ బాలభవన్, సంయుక్త ఫౌండేషన్‌లు వంటి స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల సమష్టి భాగస్వామ్యంతో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపారు.

చిన్నారులు చెడుదోవ పడితే అది దేశ భవితకు పెను విపత్తు అని గుర్తించి..చిన్నారులు మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు ఉచ్చులో చిక్కుకోకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై చైతన్య కార్యక్రమాలను ముందుండి నడిపించారు. అంతేకాదు.. లైంగిక వేధింపులపై అవగాహన కల్పిస్తూ.. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో సఫలీకృతులయ్యారు. మాదకద్రవ్యాల వినియోగంతో ఎదురయ్యే సమస్యలపై ప్రత్యేకంగా లఘు చిత్రాలను రూపొందించడం, వీధి నాటికలు, ర్యాలీలు, వైద్య శిబిరాలతో పాటు విస్తృత స్థాయిలో గోడ పత్రికలు, కరపత్రికలను రూపొందించి పాఠశాలలు, కళాశాలలతో పాటు సమాజంలోని వివిధ వర్గాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయదారులకు కళ్లెం వేసేందుకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లూ సత్ఫలితాలిచ్చాయి. మాదకద్రవ్యాల వినియోగం పరంగా గుర్తించిన హై రిస్క్ ప్రాంతాలపై డేగ కన్ను పెట్టి, మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారిని డీ అడిక్షన్ కేంద్రానికి పంపి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు మాదకద్రవ్యాల అలవాటును విడనాడేలా చేయడంలోనూ చేసిన కృషికి డిల్లీరావుకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ జాతీయ స్థాయి గుర్తింపు సాధించడంలో సహాయ సహకారాలు, భాగస్వామ్యం అందించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జిల్లా పూర్వ కలెక్టర్ డిల్లీరావు తెలిపారు.

# కొత్త క్రిమినల్ చట్టం... హైదరాబాద్‌లో తొలి కేసు నమోదు



హైదరాబాద్: కొత్త క్రిమినల్ చట్టాల ప్రకారం తెలంగాణలో తొలి కేసు నమోదయింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా కొత్త నేర, న్యాయ చట్టాలు అమలులోకి వచ్చాయి. ఈ కొత్త చట్టం కింద మధ్యప్రదేశ్‌లో అర్ధరాత్రి 12.20 గంటలకు తొలి కేసు నమోదు కాగా... తెలంగాణ రాష్ట్రంలో చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో మొదటి కేసు నమోదయింది. నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్త చట్టాల ప్రకారం సెక్షన్ 281 బీఎన్ఎస్, ఎంవీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్‌ను డిజిటల్‌గా నమోదు చేశారు. దేశంలో బ్రిటిష్ పాలన నుంచి కొనసాగుతున్న ఐపీసీ, సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ)కు గత 17వ లోక్ సభ ఆమోదం తెలిపింది. ఈ చట్టాలు జులై 1 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్ ఫిర్యాదు నమోదు, ఎస్సెమ్మెస్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ వంటి అత్యాధునిక పద్ధతులు కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థలోకి ప్రవేశించాయి.

# బిజెపి మీద విరుచుకుపడిన మహువా మొయిత్ర

న్యూఢిల్లీ: 'క్యాష్ ఫర్ క్యూరి ఆరోపణలు' కింద 17వ లోక్ సభ నుంచి బహిష్కృతురాలైన టిఎంసి ఎంపీ మహువా మొయిత్ర నేడు లోక్ సభలో బిజెపి పై విరుచుకుపడ్డరు. 'నా గళం నొక్కేసినందుకు బిజెపికి మంచి శాస్తే జరిగింది' అన్నారు. 'ఇదివరలో నేను మాట్లాడటానికి లేచినప్పుడు నన్ను మాట్లాడనివ్వలేదు. అధికార పార్టీ ఓ ఎంపీ గళాన్ని నొక్కేసింది' అన్నారు. " వారు నా గొంతుకను నొక్కేస్తే, ప్రజలు వారి నోరు మూయించారు. అంటే వారు 63 ఎంపీ సీట్లు కోల్పోయేలా చేశారు. ముఝే బిటానే కె చక్కర్ మే జనతా నే ఆప్కో బిటా దియా, ఆప్కే 63 ఎంపీస్ లాస్ కర్ దియా"అంటూ చెప్పుకొచ్చారామె. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇంకా ఆమె ఎన్నికల సంఘాన్ని కూడా తీవ్రంగా విమర్శించారు. బిజెపి ప్రవర్తనా నియమావళిని ఎన్నికల సంఘం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది" అన్నారు. "అధికార పార్టీ, ప్రధాని కారణంగా ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిని బిజెపి ఉల్లంఘించినా చూసి చూడనట్లు, విని విననట్లు వ్యవహరించింది. ఓటర్లే చివరికి ఛార్జీ తీసుకుని బిజెపికి బుద్ధి చెప్పారు"అన్నారామె. ప్రభుత్వం చేపట్టిన మౌలిక



వసతులను గురించి విమర్శిస్తూ " మీరు వందే భారత్ బుల్లెట్ రైళ్ల ప్రాజెక్టుకు రూ. 1.08 లక్షల కోట్లు కేటాయించారు. 'కవచ్' లేనందు వల్ల గత వారం మూడు రైళ్లు ఢీకొన్నాయి.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com